
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 6 మే 2025





ఉష్ణోగ్రత (అంచనా)

6-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	27
తెనాలి	38	26
నరసరావుపేట	39	26
బాపట్ల	38	27
రెంటచింతల	40	26



● కృష్ణా పశ్చిమ డెల్టాలో అధ్వానంగా మారిన కాల్వ కట్ట

కాల్వల నిర్వహణకు..

కాసులు కావాలి!

- ఖరీఫ్-2025-26 సీజన్‌కు గడ్డు కాలం..
- మరమ్మతులకు కాల్వల ఎదురు చూపులు
- నీటితీరువా వసూలు కాక.. నిధులు లేక
- ప్రభుత్వం ఆదుకుంటేనే బాగయ్యేది
- రైతుల నుంచి పన్ను వసూలు రూ. 33 కోట్లే
- సాగర్ కుడి కాల్వల పరిధిలో 355 అత్యవసర పనుల గుర్తింపు
- గత ఐదేళ్లలో ఒక్క పనీ జరగక రైతుల అవస్థలు

ఖరీఫ్-2025-26 సీజన్‌కు రాష్ట్రంలోని కాల్వల మరమ్మతుల కోసం ఎదురుచూస్తున్నాయి. అత్యవసర మరమ్మతుల కింద ఓఅండ్ఎం(ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్) నిధులు ఆయా డెల్టాలకు ఏటా మంజూరు చేయడం పరిపాటి. అయితే ఈసారి రైతుల నుంచి పన్నుల వసూళ్లు అంతంతమాత్రంగా ఉండడంతో ఈ నిధులకు ఇబ్బంది ఏర్పడింది. రాష్ట్రం మొత్తం మీద రూ. 142 కోట్ల విలువైన కాల్వల పనులు ప్రభుత్వం ఇచ్చే చల్లని కబురు కోసం ఎదురు చూస్తున్నాయి. గత వైసీపీ పాలనలో ఒక్క కాల్వకూ గుప్పెడు మట్టి పోసిందిలేదు. గండ్లు పూడ్చింది లేదు. పూడిక తీసిన పాపాన పోలేదు. దీంతో ప్రస్తుతం చివరి భూములకు చుక్కనీరు అందడం గగనమైంది.

నరసరావుపేట, మే 5, (ఆంధ్రజ్యోతి): కృష్ణా డెల్టా, సాగర్ ఆయకట్టు పరిధిలో కాల్వల మరమ్మతులు చేసేందుకు సమయం ఆసన్నమయింది. సాధారణంగా ఏటా రైతులు చెల్లించే నీటి తీరువా నుంచి ఈ పనులకు నీటిపారుదల శాఖ నిధులు సమకూర్చుకుంటుంది. నీటి తీరువాలో 80 శాతం వాటాగా ఇరిగేషన్‌కే ప్రభుత్వం అందిస్తుంది. అయితే ఈ ఏడాది పన్నుల వసూళ్లకు సంబంధించి డిమాండ్‌లో కేవలం రూ.33 కోట్లే వసూలవడం.. పనుల విషయంలో అయోమయానికి కారణమైంది. అయితే నీటిపారుదల శాఖ మాత్రం ఓఅండ్ఎం పనుల కోసం రూ.142 కోట్ల విలువైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపింది. ఈ నెలలోనే ఈ ప్రతిపాదనలపై కడా(కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) సమావేశం నిర్వహించడం, పనులను ఆమోదించడం జరిగిపోయాయి. అయితే నిధులే సమస్యగా ఉండటంతో నీటిపారుదల శాఖ దీనిపై ప్రభుత్వానికి లేఖ రాసింది. అప్పటి నుంచి ప్రభుత్వం నిర్ణయాన్ని ప్రకటించకపోవడంతో ఇటు నీటిపారుదల శాఖ, సాగునీటి సంఘాల్లో, అటు రైతుల్లో ఆందోళన పెరిగిపోతోంది.

నిధుల కోసం ఎదురు చూపులు..

కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ సాగునీటి సంఘాలను తీసుకొచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు పెట్టి సంఘాల కమిటీలను అధికారికంగా ఎన్నుకునేలా చేసింది. సంఘాలు అత్యవసర పనులు ఎక్కడెక్కడ.. ఏమేమి చేయాలనేది గుర్తించాయి. రాష్ట్రంలోని సాగునీటి కాల్వలు, డ్రెయిన్‌ల అత్యవసర మరమ్మతుల కోసం కృష్ణా డెల్టా పరిధిలో రూ.50 కోట్ల పనులకు ప్రతిపాదనలు పంపితే, మైనర్ ఇరిగేషన్(చెరువులు) కింద రూ.55 కోట్లు, సాగర్ ఆయకట్టు కింద రూ. 37 కోట్లు, నీటిపారుదల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ మొత్తాలకు సంబంధించి ప్రభుత్వం నిధులు సమకూర్చాల్సి ఉంది.



గోవిందాపురం మేజర్ కాలువలో పెరిగిన కంప చెట్లు

మరో రెండు నెలలే సమయం..

ప్రస్తుతం కృష్ణా డెల్టాలో తాగు నీటి కోసం చెరువులు నింపుకునేందుకు కాల్వలకు నీటిని విడుదల చేశారు. నిన్నటితో వాటిని కూడా ఆపాల్సి ఉంటే, మరో రెండు రోజులు కాల్వల్లో నీరు ప్రవహించే పరిస్థితి ఉంది. నీటిని కట్టేసిన వెంటనే కాల్వల పనులు వేగవంతం చేస్తేనే సకాలంలో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. అంటే ఖరీఫ్ సీజన్ కోసం జూలై 10 నుంచి కాల్వలకు తిరిగి నీటిని విడుదల చేయాల్సి ఉంది. ఇక 2 నెలలు మాత్రమే సమయం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ రెండు రోజుల్లో నిధులు మంజూరు చేయగలిగితే గండ్లు పడటానికి సిద్ధంగా ఉన్న కాల్వల కట్టల మరమ్మతులు చేసే అవకాశం ఉంటుంది. ఈ ఐదేళ్లలో పంట పండడం గగనమైపోయిన చివరి భూముల రైతులు ఈసారయినా తిండిగింజలు పండించుకునేందుకు అవకాశం ఉంటుంది.

355 పనులకు.. రూ.19.28 కోట్ల ప్రతిపాదనలు

సాగర్ కుడి కాల్వ పరిధిలో వినుకొండ, లింగంగుంట్ల, సత్తెనపల్లి, మాచర్ల డివిజన్‌లలో అత్యవసర మరమ్మతులకు సంబంధించి 355 పనులను ఇరిగేషన్ శాఖ గుర్తించింది. ఈ పనులు చేపట్టేందుకు రూ 19.28 కోట్ల అంచనా వ్యయం సిద్ధం చేశారు. ఈ నిధులతో కాల్వల్లో పూడిక తీత, కంపచెట్లు, జమ్ము, తూటుకాడ తొలగింపు పనులు చేపడుతారు. మాచర్ల నియోజకవర్గ పరిధిలోని 38 పనులకు రూ 2.17 కోట్లు, గురజాల నియోజకవర్గ పరిధిలో 31 పనులకు రూ 2.17 కోట్లు, సత్తెనపల్లి నియోజకవర్గంలో 46 పను లకు రూ 2.34 కోట్లు, పెదకూరపాడు నియోజకవర్గంలో 36 పనులకు రూ.2.16 కోట్లు, తాడికొండ నియోజకవర్గంలో 34 పనులకు రూ 2 కోట్లు, నరసరావుపేట నియోజకవర్గంలో 51 పనులకు రూ 2.30 కోట్లు, చిలకలూరిపేట నియోజకవర్గంలో పరిధిలో 29 పనులకు రూ 1.45 కోట్లు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 25 పనులు రూ 1.49 కోట్లు, వినుకొండ నియోజకవర్గం పరిధిలో 54 పనులకు వ్యయం రూ.2.70 కోట్లు, దర్శి నియోజకవర్గంలో 5 పనులకు వ్యయం రూ.20.48 లక్షలు, అద్దంకి నియోజకవర్గంలో 6 పనులకు రూ.26.56 లక్షలుగా అంచనాలు రూపొందించి, జలవనరుల శాఖ నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.

నరసరావుపేట : షట్టరు లేని తూము


నీటి తీరువాపై నిర్లక్ష్యం..

సాగర్ కాల్వల్లో మరమ్మతులకు ఇవ్వాల్సిన నీటి తీరువా నిధులను దారి మళ్లించిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కింది. నీటి తీరువా వసూలు చేయడంలో రెవెన్యూ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రైతులు ఏటా చెల్లించే నీటి శిస్తు ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీలకు 5 శాతం, ఇతర కేటాయింపులు పోగా.. 80 శాతం నిధులను మైనర్, మేజర్ ఇరిగేషన్లకు కేటాయించాలి. నీటి తీరువాకు సంబంధించిన నిధులను కాడా సాగు నీటి సంఘాల వారీగా కేటాయించాల్సి ఉంది. ఇందులో 10 శాతం పరిపాలనకు. 15 శాతం డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 14 శాతం ప్రాజెక్టు కమిటీకి కేటాయించాలి. ఇంకా నిధులు చేరకపోవడంతో మరమ్మతుల నిర్వహణలో కూడా చేతులేత్తేసే పరిస్థితులు నెలకొన్నాయి. ఏటా సాగర్ ఆయకట్టు పరిధిలో నీటి తీరువా రూ.20 కోట్లు నుంచి రూ. 21 కోట్లు వస్తుందని అంచానా. రైతులు చెల్లించే నీటి తీరువాపై కాల్వల మరమ్మతులు అధారపడి ఉంటాయి. ప్రభుత్వం ఇచ్చే నిధుల మాట ఎలా ఉన్నా.. తాము చెల్లించే నీటి తీరువా నిధులైనా కేటాయించి అత్యవసర మరమ్మతులైనా చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పనులు మొదలు పెట్టమన్నాం..

డెల్టా పరిధిలో కాల్వలకు నీరు ఆపిన వెంటనే చేయాల్సిన అత్యవసర పనులు మొదలు పెట్టమని నీటి సంఘాలకు ఇప్పటికే ఆదేశాలిచ్చాం. టెండర్ల పనులను కూడా చేయమని చెప్పాం. ఎక్కడా జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. మరమ్మతుల నిధులకు ప్రభుత్వానికి ఇప్పటికే నివేదించాం. తప్పకుండా నిధులు మంజూరవుతాయి.. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు.

- బానోతు రాంబాబు, సీఈ, నీటిపారుదల శాఖ, కృష్ణా డెల్టా విభాగం, విజయవాడ



నివురుగప్పిన పాతకక్షలకు వైసీపీ ఆజ్యం

మాచర్లలో టీడీపీ శ్రేణులపై వరుస దాడులు

- చిన్న చిన్న విషయాలకే అలజడులు
- పోలీసులపైనా తీవ్ర ఒత్తిడి తెస్తున్న వైనం

మాచర్లటౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం అత్యంత సమస్యాత్మకమైంది. గత ఎన్నికల్లో మాచర్ల నియోజకవర్గంలో జరిగిన అల్లర్లు, దాడులు, ధ్వంసాలు మర్చిపోలేనివి. అంతటి విధ్వంసం మధ్య జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డికి మాచర్ల నియోజకవర్గ చరిత్రలోనే మునుపెన్నడూ లేని భారీ మెజార్టీని ప్రజలు కట్టబెట్టారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలో కొలువుదీరింది. నియోజకవర్గంలో ప్రశాంతత నెలకొల్పేందుకు కూటమి నేతలు సంయమనం పాటిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వైసీపీ కేడర్ నియోజకవర్గంలోని గ్రామాల్లో టీడీపీ కేడర్‌పై దాడులకు పాల్పడుతోంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం మాచర్ల నియోజకవర్గంలో పరిస్థితులు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. ప్రతి చిన్న దానికి గ్రామాల్లో ఆధిపత్యం కోసం వైసీపీ శ్రేణులు.. టీడీపీ కేడర్‌పై దాడులు చేస్తూనే ఉన్నారు.

పాతకక్షల నేపథ్యంలో వైసీపీ దాడులు

- మాచర్ల మండలం పశువేములలో గతేడాది డిసెంబరు 16న టీడీపీకి చెందిన బెజవాడ రమేష్‌పై వైసీపీకి చెందిన హరిశ్చంద్ర గొడ్డలితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ రమేష్ అప్పటి నుంచి కోమాలోనే ఉన్నాడు. ఇది కాస్తా ఉద్రిక్తతలకు దారితీసి హరిశ్చంద్ర హత్యకు దారితీసింది.
- గత నెల 12న దుర్గి మండలం అడిగొప్పులలో టీడీపీకి చెందిన దొండపాటి వెంకట్రామయ్యపై గొడ్డలితో వైసీపీకి చెందిన కొత్త శ్రీరామ్మూర్తి, హనుమంతురావు దాడి చేసి గాయపరిచారు.
- గత నెల 19న మాచర్ల మండలం జమ్మలమడకలో టీడీపీకి చెందిన జలసూత్రపు పవన్, శ్రీకాంత్, నరసింహలపై అదే గ్రామానికి చెందిన వైసీపీ వర్గీయులు మల్లెల రామకృష్ణ, యలమంద, ఆంజనేయులు, మరికొందరు విచక్షణా రహితంగా దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు.
- గత నెల 25న వెల్దుర్తి మండలం గుండ్లపాడులో టీడీపీకి చెందిన ఉప్పుతోళ్ల శ్రీనుపై వైసీపీకి చెందిన చల్లా ఏడుకొండలు, ఉప్పుతోళ్ల వెంకటేశ్వర్లు, గురవయ్య, మశయ్య రాడ్లతో దాడి చేసి.. శ్రీను కాళ్లు, చేతులు విరగొట్టారు.
- గత మంగళవారం వెల్దుర్తి మండలం శిరిగిరిపాడులో టీడీపీకి చెందిన ఆరుమళ్ల విజయ్‌పై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కొమ్ము బొంగురు గొడవకు దిగారు. ఇది కాస్తా రాళ్ల రువ్వుకునే పరిస్థితికి దారితీసింది. పోలీసులు అప్రమత్తమై ఇరువర్గాలను చెదరగొట్టడంతో ఘర్షణ అదుపులోకి వచ్చింది.
- మాచర్ల పట్టణంలో మార్చి 12న చిన్న విషయానికే పట్టణంలో అలజడి సృష్టించేందుకు రెండు సామాజిక వర్గాల వైసీపీ నేతలు ఘర్షణ పడి రాళ్ల వర్షం కురిపించారు. సాక్షాత్తు గురజాల డీఎస్పీ జగదీష్ పోలీసు సిబ్బందితో పరిస్థితి అదుపు చేయడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఇలా నియోజకవర్గంలో పాత కక్షలు, చిన్న చిన్న ఘర్షణలకు కూడా వైసీపీ వర్గీయులు పట్టు కోసం టీడీపీ నేతలపై దాడి చేసి.. గాయపరుస్తూ కవ్వింపులకు దిగుతున్నారు.

పోలీసులపై తీవ్ర ఒత్తిళ్లు..

ఒకవైపు అధికార పార్టీ కేడర్‌పై దాడులు చేస్తూనే వైసీపీకి చెందిన నేతలు పోలీసులపై తీవ్ర ఒత్తిడికి దిగుతున్నారు. టీడీపీ నేతలు సంయమనం పాటించడం వల్ల ఘర్షణలు అదుపులో ఉంటున్నాయి. అదే స్థాయిలో ఢీ అంటే ఢీ అని వైసీపీ వర్గీయులపై టీడీపీ వర్గీయులు దాడులకు పాల్పడితే నియోజకవర్గంలో శాంతిభద్రతలు అదుపు తప్పే పరిస్థితి నెలకొంటుంది. సమస్యాత్మకమైన గ్రామాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలి. గత చరిత్రను దృష్టిలో ఉంచుకుని ఘర్షణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేకుంటే నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుంది.

కార్డన్ సెర్చ్‌లో వెలుగుచూసిన వైసీపీ కుట్ర

వారం వ్యవధిలో వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు గ్రామంలో వైసీపీ శ్రేణులు.. టీడీపీ నాయకులే లక్ష్యంగా దా డులకు పాల్పడ్డాయి. ముందుగా కవ్వింపు చర్యలకు పాల్పడి.. తదుపరి భారీ వ్యూహంతో మారణాయుధాలు, రాళ్లు, కారపు నీళ్ల బాటిళ్లు ఏర్పాటు చేసుకొని దాడికి దిగేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో పోలీసులు డివిజన్ పరిధిలోని అధికారులతో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పట్టుబడ్డ మారణాయుధాలను చూసి పోలీసులు విస్తుపోయారు. ఇలా నియోజకవర్గంలో దాడులు జరిపి, మరలా స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పట్టు సాధించేందుకు వైసీపీ శ్రేణులు పన్నాగాలు పన్నుతున్నాయి.



శిరిగిరిపాడులో కార్డన్ సెర్చ్‌లో పట్టుబడ్డ మారణాయుధాలు (ఫైల్‌ఫొటో)

బాలికల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం

కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): యుక్త వయస్సులో ఉన్న బాలికలకు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం కార్యక్రమం దోహద పడుతుందని కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కౌమార బాలికల సాధికారత లక్ష్యంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ నెల 2 నుండి 10వ తేదీ వరకు వివిధ శిక్షణ కార్యక్రమాలను యుక్త వయస్సు బాలికలకు అందిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఇందుకు సంబంధించి ఆరు అంశాలను చర్చిస్తూ పుస్తకాలను రూపొందించడం జరిగిందన్నారు. గ్రామ, వార్డు స్థాయి వనరుల బృందం అంటే మహిళా పోలీస్, అంగన్వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, వీఓ సభ్యురాలు, సీఆర్పీ లేదా విద్యా కార్యదర్శి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన క్యాలెండర్ ప్రకారం నిర్దేశించిన బోధనాంశాలు రిసోర్సు పర్సన్ ద్వారా అవగాహన కల్పిస్తారని ఆయన వివరించారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ, వార్డుస్థాయి బాలల సంక్షేమ, సంరక్షణ కమిటీ సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకు మహిళా పోలీసు ఆ కమిటీకి మెంబర్ కన్వీనర్‌గా కీలక భూమిక పోషిస్తారని చెప్పారు. ప్రతి రోజు నిర్వహించే కార్యక్రమాలను ఈ- సాధన పోర్టల్ ద్వారా అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

ఉత్తరాదిన ఉసూరు.. ఇక్కడ హుషారు!



- పల్నాడు పరిశ్రమల్లో బిహారీ కూలీల హవా
- స్వరాష్ట్రంలో ఉపాధి లేక.. ఇక్కడికి వలసలు
- కూలీల కొరతతో.. బిహార్ బాటపట్టిన యజమానులు
- ఉమ్మడిగా నివాసం..వంటావార్పు..
- ఖర్చులు పోగా.. మిగిలినది కుటుంబానికి..

పిడుగురాళ్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): పుట్టిన ఊరు కాదు.. పక్క ఊరు అంతకన్నా కాదు.. వందల మైళ్ల దూరం.. భాష రాదు.. ఈ ప్రాంతం వంటకాలు అంటే ఏమిటో కూడా తెలియదు.. అయినా ఇక్కడకు వచ్చి రేయింబవళ్లు కష్టపడుతున్నారు. వచ్చే సొమ్మును బిహార్‌లోని తమ కుటుంబ సభ్యులకు పంపి ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. బిహార్ రాష్ట్రానికి చెందిన యువత పిడుగురాళ్ల, సమీప పట్టణాల్లో ఉపాధి బాటలో ఉన్నారు. పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్ల, గురజాల, దాచేపల్లి, నకరికల్లు, మాచర్ల తదితర ప్రాంతాల్లో బియ్యం మిల్లులు, సున్నం మిల్లులు, ఇంటి నిర్మాణానికి ఉపయోగించే పీఓపీ తయారీ పరిశ్రమలు విరివిగా ఉన్నాయి. వీటిల్లో బిహార్ యువతే వందలాది మంది ఉపాధి పొందుతున్నారు.

తమ రాష్ట్రంలో సరిగా పంటలు పండక, ఉపాధి లేక అక్కడి యువత కొందరి సాయంతో పల్నాడు ప్రాంతంలోని పరిశ్రమల్లో పనులకు వలస వస్తున్నారు. ఒకప్పుడు ఇక్కడి రైస్‌మిల్లులు, సున్నం మిల్లుల్లో స్థానికులకే ఎక్కువగా ఉపాధి అకాశాలుండేవి. అయితే స్థానికులు ఆయా మిల్లుల్లో పనిచేసేందుకు కొన్ని గంటలు మాత్రమే సమయం కేటాయిస్తున్నారు. దీంతో వ్యాపారులు 24 గంటలూ మిల్లులు ఆడించేందుకు కూలీలు స్థానికంగా దొరకకపోవడంతో తెలిసిన వారి సాయంతో.. బిహార్ బాట పట్టారు. అక్కడి వారిని ఇక్కడికి రప్పించి మిల్లుల్లో 24 గంటలు పనిచేసేలా ఒప్పందం కుదుర్చుకోవడమే కాకుండా.. అందుకు తగ్గ రోజువారి కూలీ కూడా ఇస్తున్నారు. ఒకప్పుడు వంద మంది ఉన్న కూలీల సంఖ్య.. ప్రస్తుతం ఒక్క పల్నాడు ప్రాంతంలోనే వెయ్యికి పైగా చేరింది. ప్రతి వారం బట్వాడాను కొంత ఖర్చులకు పోను... మిగిలినది స్థానికంగా ఉన్న ఆన్‌లైన్ బ్యాంక్, ఫోన్ పే ద్వారా స్వరాష్ట్రంలోని కుటుంబ సభ్యులకు పంపిస్తున్నారు.

ఉమ్మడిగా జీవనం

బిహారీయులు మిల్లులు, కర్మాగారాల్లో ఒక ముఠాగా ఏర్పడి పనిచేస్తున్నారు. వారిలో రోజుకొకరు వంట వండే బాధ్యత తీసుకుంటే.. మిగిలిన వారంతా పనుల్లోకి వెళ్తారు. వచ్చిన కూలీ అందరూ సమానంగా పంచుకుంటారు.

నాలుగు రూపాయలు మిగులుతున్నాయి..



ఇక్కడ 16 గంటలకు పైగా కష్టపడుతున్నాం. అందుకు తగ్గట్లు కూలీ కూడా వస్తుంది. ఖర్చులు పోను నాలుగు రూపాయలు వెనకేసుకుంటున్నాం. సొంత ఊరులో ఉపాధి లేక ఇక్కడకి వచ్చి కష్టపడి పనిచేస్తున్నాం. తగిన ఆదాయం వస్తోంది. **- గంటూర్‌కుమార్, బిహారీ**

ఇక్కడకు వచ్చాక అప్పులు తీరాయి



మాది బిహార్‌లోని మర్లికా జిల్లా జోర్‌గాం ఊరు. అక్కడ ఉపాధి లేక పస్తులున్న రోజులున్నాయి. తెలిసిన వారి ద్వారా పిడుగురాళ్లకు వచ్చి రెండేళ్ల అవుతుంది.

- ప్రమోద్‌కుమార్, బిహారీ

పారాహుషార్

300 గ్రాములు మించితే..

మాంసాహారుల్లో చికెన్‌ను ఇష్టపడని వారు ఉండరు. కొందరికైతే ఆదివారం వచ్చిందంటే చికెన్ లేనిదే ముద్ద దిగదు. అయితే చికెన్ తినడం వల్ల క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని ఓ తాజా అధ్యయనంలో తేలింది. ఆ వివరాలు తెలుసుకుందాం. వయసు, ఆరోగ్యం, వైద్య చరిత్ర వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, 19 ఏళ్ల పాటు, నాలుగు వేల మందిపై ఇటలీ పరిశోధకులు చేసిన అధ్యయనంలో పలు విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. వారానికి 300 గ్రాముల కోళ్ల ఉత్పత్తులు తినడం వల్ల జీర్ణశయాంతర క్యాన్సర్ ముప్పు రెండింతలు ఎక్కువవుతుందని న్యూట్రియంట్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఆ అధ్యయనంలో వెల్లడైంది. ఈ ప్రమాదం మహిళల కంటే పురుషుల్లోనే ఎక్కువని పరిశోధకులు తేల్చారు. అలాగే వారానికి 300 గ్రాములు, అంతకంటే ఎక్కువగా కోళ్ల ఉత్పత్తులు తినే వారిలో మరణాల ముప్పు కూడా 27 శాతం అధికమని గుర్తించారు. చికెన్‌లో మన శరీరానికి అవసరమైన ప్రొటీన్, విటమిన్ బీ12, కోలిన్ వంటివి పుష్కలంగా ఉన్నప్పటికీ, చికెన్‌ను వారానికి 100 గ్రాములకు మించకుండా మితంగా తినడం మంచిదని పరిశోధకులు సూచిస్తున్నారు.




హెల్త్ న్యూస్

టైప్5 మధుమేహం గురించి విన్నారా?

రక్తంలో ఇన్సులిన్ మోతాదు పెరిగితే, దాన్ని టైప్2 మధుమేహంగా నిర్ధారిస్తారు. మరి ఇన్సులిన్ తగ్గితే? రక్తంలో సరిపడా ఇన్సులిన్ లేని పరిస్థితి, టైప్5 మధుమేహంగా అధికారిక గుర్తింపు పొందింది. మరిన్ని వివరాలు...

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కొన్ని దశాబ్దాల క్రితమే పోషకాహార లోపంతో సంబంధమున్న మధుమేహాన్ని గుర్తించడం జరిగింది. ఈ రకమైన మధుమేహం తాజాగా అధికారిక గుర్తింపును దక్కించుకుంది. అంతర్జాతీయ డయాబెటిస్ ఫెడరేషన్, ఈ మధుమేహాన్ని టైప్5 మధుమేహంగా వర్గీకరించింది. 70 ఏళ్ల క్రితమే ఈ మధుమేహాన్ని గుర్తించినప్పటికీ ప్రపంచ ఆరోగ్య చర్చల్లో దీన్ని నిర్లక్ష్యం చేయడం జరిగింది. 20వ శతాబ్దంలోనే వెలుగులోకొచ్చిన ఈ పరిస్థితిని టైప్1 లేదా టైప్2 మధుమేహంగా తప్పుగా వర్గీకరించారు. ఈ అసాధారణమైన మధుమేహం, ప్రపంచవ్యాప్తంగా, మరీ ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికాల్లోని పోషకాహారలోపంతో బాధపడే యువతను పట్టి పీడిస్తున్నట్టు, 160 దేశాల్లోని 250 జాతీయ డయాబెటిక్ అసోసియేషన్లు అంచనా వేసినట్టు అంతర్జాతీయ డయాబెటిస్ ఫెడరేషన్ పేర్కొంటోంది. దీర్ఘకాలం పాటు పోషకాహార లోపంతో బాధపడే వారిలో ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గి టైప్5 మధుమేహం పెరుగుతోంది. ప్రత్యేకించి కౌమార దశలో బయల్పడే ఈ మధుమేహానికి ఒక జన్యులోపమే కారణం. ఈ రకమైన జన్యు ఉత్పరివర్తనం తల్లితండ్రుల నుంచి పిల్లలకు వంశపారంపర్యంగా సంక్రమిస్తూ ఉంటుంది. అయితే టైప్5 మధుమేహానికి ఇటీవలే అధికారిక గుర్తింపు లభించింది కాబట్టి వ్యాధినిర్ధారణ, చికిత్సా విధానాలు ఇంకా అభివృద్ధి దశలోనే ఉన్నాయి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి సంబంధించి చేపట్టిన పరిశోధన ఆధారంగా ఈ రుగ్మతకు సంబంధించి మరో రెండేళ్లలో మార్గదర్శకాలను అభివృద్ధి చేయనున్నట్టు అంతర్జాతీయ మధుమేహ ఫెడరేషన్ ప్రకటించింది.





ఉబ్బసం నుంచి ఉపశమనం

కీలెంచి వాత పెట్టాలనే సూత్రం ఉబ్బసానికి కూడా వర్తిస్తుంది. ఈ రుగ్మత ఉన్న ప్రతి ఒక్కరికీ ఒకే చికిత్స అందించడం సరి కాదు. ప్రేరేపించే అంశాలు, వయసు, తీవ్రతల ఆధారంగా తగిన చికిత్సా మార్గాన్ని ఎంచుకుంటే ఉబ్బసాన్ని అదుపు చేయడమే కాదు, దాన్నుంచి సమూలంగా విముక్తి పొందవచ్చు అంటున్నారు వైద్యులు.

ఉబ్బసాన్ని వ్యాధిగా పరిగణించకూడదు. దీన్నొక పరిస్థితిగానే భావించాలి. ఈ సమస్య చికిత్సకు లొంగడమే కాకుండా, సకాలంలో స్పందించి, తగిన చికిత్స తీసుకోగలిగితే దీన్నుంచి శాశ్వత విముక్తి కూడా పొందే వీలుంటుంది. నిజానికి ఉబ్బసం వ్యాధి, చికిత్స పట్ల ఉన్న అపోహలే వ్యాధి నియంత్రణకు అవరోధాలుగా మారుతున్నాయి. సమర్థమైన చికిత్స అందుబాటులో ఉన్నా, వ్యాధిని అదుపులో ఉంచే ముందు జాగ్రత్త చర్యల పట్ల అవగాహన లేకపోవడం వల్ల సమస్యను అదుపు చేయలేకపోతున్నాం. ఉబ్బసాన్ని ప్రేరేపించే కారకాలను నిర్లక్ష్యం చేయడం, పక్కదారి పట్టించే లక్షణాలకు స్వీయ చికిత్సలను ఆశ్రయించడం... ఇలా ఈ వ్యాధిని చేతులారా పెంచి పోషించుకుంటున్నాం!

గ్లోబల్ ఇనీషియేటివ్ ఆస్తమా అనే లాభాపేక్ష లేని అంతర్జాతీయ సంస్థ, ప్రతి ఏటా మే ఆరును ఆస్తమా దినంగా ప్రకటించి ప్రపంచ వ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలను చేపడుతూ ఉంటుంది.

లెక్కలేనన్ని కారణాలు

ఉబ్బసానికి వయసుతో సంబంధం లేదు. ఈ సమస్య ఎవరికైనా, ఎప్పుడైనా తలెత్తవచ్చు. సాధారణ అలర్జీ కూడా దీర్ఘకాలంలో ఉబ్బసానికి దారి తీయొచ్చు. ఈ పరిస్థితికి ఇంకొన్ని కారణాలు ఏవంటే...

- వంశపారంపర్యంగా సంక్రమించవచ్చు
- వాతావరణ కాలుష్యం వల్ల రావొచ్చు
- జీవనశైలి, ఆహారశైలి మార్పులు రావొచ్చు
- కృత్రిమ పదార్థ రంగులు, రసాయనాల వల్ల తలెత్తవచ్చు
- ఫుడ్ అలర్జీ, డస్ట్ అలర్జీల వల్ల రావొచ్చు
- కొందరు పుట్టుకతోనే రావొచ్చు
- మరి కొందరికి బాల్యంలో తలెత్తవచ్చు
- జన్యు ఉత్పరివర్తనల వల్ల రావొచ్చు
- బొద్దింకలు, పూలపుప్పొడి వల్ల తలెత్తవచ్చు
- పరిశ్రమల నుంచి వెలువడే పొగల వల్ల రావొచ్చు

ఈ లక్షణాల మీద కన్నేసి...

దగ్గు, పిల్లికూతలు, ఆయాసం.. ఈ మూడు ఉబ్బసం ప్రధాన లక్షణాలు. కానీ ఇవే లక్షణాలు సాధారణ వైరల్ ఇన్‌ఫెక్షన్లలో కూడా కనిపిస్తాయి. కానీ అవి కొన్ని రోజులు వేధించి, తగ్గిపోతాయి. అలా కాకుండా పదే పదే అవే లక్షణాలు వేధిస్తూ ఉన్నా, ఒక రుతువులో మాత్రమే ఈ లక్షణాలు పెరుగుతున్నా ఉబ్బసంగా అనుమానించాలి. కొత్తగా బడికి వెళ్తున్న పిల్లల్లో ఇలాంటి లక్షణాలు ప్రతి నెలా కనిపించినప్పుడు, ఆ లక్షణాలను ప్రేరేపించే అంశాలు, కుటుంబ చరిత్ర, తీవ్రతల ఆధారంగా ఉబ్బసాన్ని నిర్ధారించుకోవాలి. అయితే రుతుపరమైన వైరల్ ఇన్‌ఫెక్షన్లలో కూడా ఇవే లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి కాబట్టి ఉబ్బసాన్ని నిర్ధారించుకోవడం కోసం కొన్ని పరీక్షలు చేయించుకోవలసి ఉంటుంది. పెద్దల్లో కూడా అకస్మాత్తుగా ఉబ్బసం తలెత్తుతుంది.

పరీక్షలున్నాయి

ఉబ్బసాన్ని నిర్ధారించడం తేలికే! స్పైరోమెట్రీ, పీక్ ఫ్లో మెషిన్ పరీక్షలతో ఉబ్బసం తీవ్రత తెలుస్తుంది. మందులతో ఉబ్బసం లక్షణాలు అదుపులోకి రావడాన్ని బట్టి కూడా సమస్యను ఉబ్బసంగా నిర్ధారించుకోవచ్చు. లక్షణాలు పగలు తక్కువగా సాయంత్రం, రాత్రి వేళ ఎక్కువగా ఉన్నప్పుడు కూడా ఉబ్బసంగా నిర్ధారించుకోవచ్చు. అలాగే కొందరికి అలర్జీ పరీక్షలు కూడా అవసరమవుతాయి. అలాగే అలర్జీ సంకేతాలు, లక్షణాలకు సంబంధించిన ప్రశ్నావళులను పూరించడం ద్వారా, కలిగి ఉన్న అలర్జీల పట్ల స్పష్టత ఏర్పరుచుకుని, ఉబ్బసానికే దారి తీసే అవకాశాలను కూడా అంచనా వేయవచ్చు. వైద్యులు, ఈ పరీక్షలన్నిటినీ ఉబ్బసం నిర్వహణ సాధనాలుగా పరిగణిస్తారు. అలాగే కొందరు పిల్లల్లో వ్యాయామం చేసినప్పుడు మాత్రమే ఉబ్బసం ప్రేరేపితమవుతూ ఉంటుంది. ఇలాంటి పిల్లల చేత వ్యాయామం చేయించి, పల్మోనరీ ఫంక్షన్ టెస్ట్ చేపట్టి ఉబ్బసంగా నిర్ధారించుకోవచ్చు.

ట్రిగ్గర్ కావొచ్చు!

కొందరికి ఐదు నిమిషాల ముందు వరకూ లేని ఆయాసం హఠాత్తుగా మొదలవుతుంది. భయపడినా, విపరీతమైన ఒత్తిడి, శారీరక శ్రమకు లోనైనా క్షణాల్లో ఉబ్బసం లక్షణాలు కనిపించి ఊపిరి ఆడనివ్వకుండా చేసేస్తాయి. ఇలాంటివాళ్లు ఇన్‌హేలర్స్ ఎప్పుడూ దగ్గర పెట్టుకోవాలి. క్రీడాకారులైతే ఆటకు ముందు వీటిని వాడితే, ఉబ్బసం వేధించకుండా ఉంటుంది.



ఇన్‌హేలర్స్ సురక్షితం

ఉబ్బసానికి ఉత్తమమైన చికిత్స నెబ్యులైజర్స్, ఇన్‌హేలర్స్ స్టిరాయిడ్స్. చాలామంది వీటిని వాడడానికి ఇష్టపడరు. వైద్యులు ఇన్‌హేలర్స్ సూచించినప్పుడు వేరే మందులను సూచించమని వైద్యులను ఒత్తిడి చేస్తారు. కానీ ఉబ్బసానికి ఇన్‌హేలర్స్ సురక్షితమైన చికిత్స. తీవ్రతను బట్టి కొందరికి స్టిరాయిడ్స్ కూడా అవసరం పడొచ్చు. ఈ రెండూ ఇతరత్రా దుష్ప్రభావాలు కలిగించకుండా నేరుగా ఊపిరితిత్తుల మీదే పనిచేస్తాయి.

అలాగే కొందర్లో పిల్లికూతలు, ఆయాసం లేకుండా కేవలం దగ్గుతోనే ఉబ్బసం బయల్పడవచ్చు. ఐదేళ్ల లోపు పిల్లల్లో పిల్లికూతల రూపంలో ఉబ్బసం బయటపడొచ్చు.

అలర్జీలున్నాయా?

గత రెండు దశాబ్దాల్లో మన దేశంలో ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోయాయి. ఇలా ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోయినప్పుడు మన శరీరం వ్యాధినిరోధకశక్తి స్పందన తీరు మారిపోతుంది. ఫలితంగా కొన్ని వాతావరణాలకు, భావోద్వేగాలకూ, పదార్థాలకూ శరీరం ప్రతికూలంగా స్పందించి, ఉబ్బసం లక్షణాలు వేధించడం మొదలుపెడతాయి. సాధారణంగా అలర్జీలన్నీ ఉబ్బసానికే దారి తీస్తాయని అనుకుంటూ ఉంటారు. కానీ ముక్కు నుంచి నీరు కారే అలర్జిక్ రైనైటిస్ లాంటి 40% నుంచి 50% అలర్జీలు మాత్రమే ఉబ్బసానికి దారి తీస్తాయి. మరీ ముఖ్యంగా పిల్లల్లో అలర్జీలు ఉబ్బసాలకు దారి తీసే అవకాశాలు ఎక్కువ. కానీ ఎక్కువ శాతం పిల్లల్లో అలర్జీ కారక ఉబ్బసం ఉన్నప్పటికీ, సరైన చికిత్సను అందించగలిగితే, వయసు పెరిగేకొద్దీ ఆ లక్షణాలన్నీ సమసిపోతూ ఉంటాయి.

చికిత్స ఇలా...

అకస్మాత్తుగా తీవ్ర ఉబ్బసం దాడి చేసినప్పుడు వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లాలి. ఆ సమయంలో నెబ్యులేజేషన్‌తో పాటు ఆక్సిజన్ కూడా అవసరమవుతుంది. ఇన్‌హేలర్స్, స్టిరాయిడ్స్ కూడా అవసరమవుతాయి. దీర్ఘకాల ఉబ్బసం ఉన్నవారు అలర్జీలను తగ్గించుకోవడం అవసరం. కొందరికి అగరబత్తీలు, సాంబ్రాణి వాసనలకు ఉబ్బసం లక్షణాలు వేధిస్తాయి. వీళ్లు మాస్కులు వాడుకోవాలి. స్వీట్లు తిన్నప్పుడు లక్షణాలు తీవ్రమైతే వాటికి దూరంగా ఉండాలి. చల్లని పదార్థాలు, కొన్ని రకాల పండ్లు, వంకాయ, గుడ్లు, నట్స్‌తో కూడా కొందర్లో ఉబ్బసం తలెత్తుతుంది. ఆ కారకాలను కనిపెట్టి వాటికి దూరంగా ఉండాలి. ఇన్‌హేలర్స్ వాడుకుంటే వాటికి అలవాటు పడిపోతాం అనే ఒక ప్రధాన అపోహ కూడా సర్వత్రా నాటుకుపోయింది. వీటిని ఉబ్బసం చివరి దశలోనే ఇన్‌హేలర్స్ వాడుకోవాలి అనుకుంటూ ఉంటారు. కానీ నిజానికి ఇవి వ్యాధి ప్రారంభంలో వాడుకోవలసినవి. మిల్లీగ్రాముల పరిమాణంలో ఔషధాన్ని కలిగి ఉండే ఇన్‌హేలర్స్ మాత్రల కంటే సున్నితమైనవి. ఇవి మాత్రల్లా రక్తంలో కలిసి శరీరమంతా ప్రవహించకుండా, నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లి సమస్యను పరిష్కరిస్తాయి. పైగా వీటికి దుష్ప్రభావాలు ఉండవు. సమస్య కూడా వెంటనే పరిష్కారమవుతుంది. కాబట్టి ఇన్‌హేలర్స్ అన్ని విధాలా సురక్షితమైనవి.

డాక్టర్ పి. నవీన్ సారథి
కన్సల్టెంట్ పీడియాట్రిక్ పల్మోనాలజిస్ట్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్,
హైదరాబాద్.





పెద్దపేగు పదిలంగా

మన దేశంలో అత్యంత సాధారణ క్యాన్సర్లలో పెద్ద పేగు క్యాన్సర్ ఒకటిగా మారిపోయింది. జీర్ణకోశ సమస్యలను తలపించే పెద్ద పేగు క్యాన్సర్ చికిత్స పక్కదారి పట్టే ప్రమాదం ఉంది కాబట్టి అప్రమత్తతతో వ్యవహరించడం అవసరమంటున్నారు వైద్యులు.

గత ఐదేళ్ల కాలంలో పెద్ద పేగు క్యాన్సర్ ఉదంతాలు రెట్టింపయ్యాయి. మునుపు ఏడవ అత్యంత సాధారణ క్యాన్సర్‌గా పరిమితమైపోయిన ఈ క్యాన్సర్ తాజాగా మూడవ స్థానానికి ఎగబాకింది. ప్రత్యేకించి యువతలో ఈ క్యాన్సర్ పెరగడం ఆందోళన కలిగించే విషయం. మరీ ముఖ్యంగా ఈ క్యాన్సర్‌ను తొలి దశల్లోనే గుర్తించలేకపోవడం వల్ల వ్యాధి ముదిరి చికిత్స క్లిష్టమయ్యే పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఇందుకు కారణం, పెద్దపేగు క్యాన్సర్ లక్షణాలు పొట్ట, పేగుల్లో తలెత్తే సాధారణ సమస్యలను తలపించేలా ఉండడమే!

తప్పుదోవ పట్టించే లక్షణాలు

మలబద్ధకం: రోజుల తరబడి మలబద్ధకం వేధిస్తుంది. అయితే అడపాదడపా ఈ సమస్య సాధారణమే కాబట్టి ఎవరూ దీన్ని పెద్దగా పట్టించుకోరు. కానీ పెద్దపేగు క్యాన్సర్‌గా భావించరు

విరేచనాలు: ఈ లక్షణం కూడా అందర్లో అడపాదడపా కనిపిస్తూనే ఉంటుంది. కాబట్టి ఈ లక్షణాన్ని కూడా నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు

మిశ్రమ సమస్య: కొన్ని రోజులు మలబద్ధకం, ఇంకొన్ని రోజులు విరేచనాలు వేధిస్తాయి. ఇలాంటి మిశ్రమ లక్షణాలు కూడా పెద్దపేగు క్యాన్సర్‌ను సూచిస్తాయి

మలంలో రక్తం: మలంలో రక్తం కనిపించడం కూడా పెద్దపేగు క్యాన్సర్ లక్షణమే!

మలవిసర్జనలో ఇబ్బంది: మలవిసర్జన సాఫీగా, సునాయాసంగా జరగకపోయినా పెద్దపేగు క్యాన్సర్‌గా అనుమానించాలి

అల్సరేటివ్ కొలైటిస్: ఈ సమస్య నిర్లక్ష్యానికి గురైనప్పుడు, అది పెద్దపేగు క్యాన్సర్‌కు దారి తీసే ప్రమాదం ఉంటుంది

బరువు/ఆకలి తగ్గడం: అకారణంగా శరీర బరువు, ఆకలి తగ్గుతున్నా పెద్దపేగు క్యాన్సర్‌గా అనుమానించాలి

వీరికి ముప్పు ఎక్కువ

- అధిక బరువు
- కుటుంబ చరిత్రలో పెద్దపేగు క్యాన్సర్
- అస్తవ్యస్థ ఆహార, జీవనశైలులు
- ఎక్కువగా రెడ్ మీట్ తినడం
- ధూమపానం, మద్యపానం
- వ్యాయామం లోపం
- ఎక్కువ గంటలు కదలకుండా పనిచేయడం
- బొగ్గుల మీద కాల్చిన చేపలు తినడం

నియంత్రణ చర్యలు ఇవే!

పెద్దపేగు క్యాన్సర్ నివారణ సులభమే! కొద్దిపాటి అప్రమత్తతతో, ముందు జాగ్రత్తలతో ఈ క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చు.

- బరువును అదుపులో ఉంచుకోవాలి
- ధూమపానం, మద్యపానం మానేయాలి
- వ్యాయామం చేస్తూ, శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవాలి
- కుటుంబ చరిత్రలో పెద్దపేగు క్యాన్సర్ ఉన్నవాళ్లు 40 ఏళ్లు దాటిన వెంటనే, లేనివాళ్లు 50ఏళ్లు దాటగానే కొలనోస్కోపీ చేయించుకోవాలి
- ఒకసారి కొలనోస్కోపీలో క్యాన్సర్ లేదని నిర్ధారణ అయినవాళ్లు అప్పటి నుంచి ప్రతి పదేళ్లకోసారి కొలనోస్కోపీ చేయించుకోవాలి
- రెడ్ మీట్, బొగ్గుల మీద కాల్చిన చేపలు తినడం మానేయాలి

పెద్దపేగు ఆహారం

పెద్ద పేగు ఆరోగ్యం కోసం పీచు ఎక్కువగా ఉండే ఆహారం తినాలి. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. నూనెలో వేయించిన పదార్థాలు, పిజ్జాలు, బర్గర్లు లాంటి జంక్ ఫుడ్ తగ్గించాలి.



వ్యాధి నిర్ధారణ ఇలా...

మలబద్ధకమైనా, విరేచనాలు అయినా 5 నుంచి 7 రోజులకు క్రమేపీ సర్దుకుంటాయి. పొట్ట, పేగులకు సంబంధించిన సాధారణ సమస్యలన్నీ తాత్కాలికంగానే వేధించి, తగ్గిపోతూ ఉంటాయి. ఇలా కాకుండా నెల, రెండు నెలల పాటు లక్షణాలు వేధిస్తూ ఉన్నా, బరువు తగ్గిపోతున్నా తప్పనిసరిగా వైద్యులను కలిసి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. రక్తపరీక్షలు, ట్యూమర్ మార్కర్లు, కొలనోస్కోపీలతో పెద్దపేగు క్యాన్సర్‌ను సులువుగా పసిగట్టవచ్చు. కొలనోస్కోపీతో ఒకటి, రెండు దశల్లోని కనిపెట్టవచ్చు. ఆ తర్వాత అవసరాన్ని బట్టి సిటి స్కాన్, సిటి కొలనోగ్రఫీలు చేసి, క్యాన్సర్ తీవ్రతను అంచనా వేయవచ్చు. శరీరంలోకి ఎలాంటి స్కోప్‌ను చొప్పించకుండానే పెద్దపేగు, పురీషనాళంలోని పాలిప్స్, పుండ్లు, క్యాన్సర్ గడ్డలను కనిపెట్టడంలో సిటి కొలనోగ్రఫీ బాగా తోడ్పడుతుంది. పెద్దపేగు క్యాన్సర్ ప్రారంభంలో చిన్న పాలిప్‌లా మొదలవుతుంది. కాబట్టి స్కాన్ సమయంలోనే వీటిని పసిగట్టి, తొలగించగలిగితే వ్యాధి ముదురకుండా చూసుకోవచ్చు.

చికిత్స సులువే!

పెద్దపేగుల్లో తలెత్తే క్యాన్సర్ ముందరి పాలిప్స్, కణుతులను ఎండోస్కోపీతో తొలగించుకోవచ్చు. ఈ చికిత్స రెండు, మూడు గంటల్లో పూర్తవుతుంది. తర్వాతి రోజే రోగి ఇంటికి వెళ్లిపోవచ్చు. క్యాన్సర్ మూడు, నాల్గవ దశలకు చేరుకున్నప్పుడు సర్జరీ చేయక తప్పదు. చివరి దశల్లో క్యాన్సర్ పెద్దపేగు నుంచి కాలేయం, ఎముకలు, ఊపిరితిత్తులకు వ్యాపించినప్పుడు సర్జరీ ముందు, తర్వాత కీమోథెరపీ, రేడియోథెరపీ అవసరమవుతుంది. తాజాగా రొబొటిక్ సర్జరీ కూడా అందుబాటులోకొచ్చింది. చిన్న కోతతో కొనసాగే ఈ సర్జరీతో రోగి తక్కువ కాలంలోనే కోలుకోగలుగుతాడు. సర్జరీ తదనంతరం దుష్ప్రభావాలు కూడా ఉండవు.

డాక్టర్ కృష్ణగోపాల్ ఎస్ భండారి
సీనియర్ కన్సల్టెంట్
గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్,
మెడికవర్ హాస్పిటల్స్,
హైదరాబాద్.



తెలుసుకుందాం

మెదడుకు పదును ఇలా...

మెదడు చురుగ్గా ఉంచుకున్నంత కాలం, మతిమరుపు సమస్యలు దరి చేరకుండా ఉంటాయి. మరీ ముఖ్యంగా 60 ఏళ్లు పైబడిన వాళ్లు మెదడుకు వ్యాయామాన్ని అందిస్తూనే ఉండాలి. అందుకోసం....

రోజుకొక కొత్త విషయం: కొత్త సమాచారంతో మెదడుకు సవాలు విసురుతూ మెదడును చురుగ్గా ఉంచుకుంటూ ఉండాలి. కొత్త అభిరుచి ఏర్పరుచుకోవడం, కొత్త భాష నేర్చుకోవడం, కొత్త సంగీత వాయిద్యం సాధన చేయడం లాంటివన్నీ మెదడుకు వ్యాయామాలే! ఇవన్నీ చేయలేనివాళ్లు కొత్త వంటకం వండడం, కొత్త విషయాలను తెలుసుకోవడం లాంటివి చేయొచ్చు.

బ్రెయిన్ గేమ్స్, పజిల్స్: సుడొకు, పజిల్స్ పూరిస్తూ వాటిని నిరంతరం సాధన చేస్తూ ఉండాలి. ఈ ఆటల కోసం రోజుకు అరగంట కేటాయించడం వల్ల మెదడు చురుకుదనం పెరుగుతుంది. అయితే రోజూ ఒకే రకమైన బ్రెయిన్ గేమ్స్‌కు బదులుగా ఒక రోజు సుడొకు, ఒక రోజు పదవినోదం, మరొక రోజు అంకెల గారడీ లాంటివి ఆడుతూ ఉండాలి.

ధ్యానం: ధ్యానంతో మానసిక ప్రశాంతత దక్కడంతో పాటు జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందని పరిశోధనల్లో తేలింది. క్రమం తప్పక ధ్యానం చేయడం వల్ల జ్ఞాపకశక్తితో సంబంధమున్న మెదడులోని హిప్పొపొటమస్ అనే ప్రదేశం బలపడుతుంది.

వాటం మార్పు: కుడి చేతి వాటం ఉన్న వాళ్లు ఎడమ చేతినీ, ఎడమ చేతి వాటం ఉన్న వాళ్లు కుడి చేతినీ వాడుకుంటూ ఉండాలి. బ్రష్‌తో పళ్లు తోముకోడానికీ, చీపురు పట్టుకుని ఊడ్చడానికీ, ఏదైనా అందుకోడానికీ, గరిట తిప్పడానికీ.. ఇలా తేలికపాటి పనుల కోసం చేతి వాటం మారుస్తూ ఉండడం వల్ల మెదడులోని రెండు అర్ధభాగాలూ చైతన్యమవుతాయి.

వ్యాయామం: వ్యాయామంతో మెదడు కూడా లాభపడుతుంది. ఏరోబిక్ వ్యాయామంతో మెదడుకు రక్తప్రసరణ మెరుగవుతుంది. నడక, ఈత, డాన్స్.. ఇవన్నీ మెదడును చురుగ్గా ఉంచుతాయి. కాబట్టి రోజుకు కనీసం 30 నిమిషాలకు తగ్గకుండా వ్యాయామం చేయాలి.

అనుబంధాలు: సంభాషణ, హాస్యం, అనుబంధాలు మెదడును ఆరోగ్యంగా ఉంచుతాయి. కాబట్టి స్నేహితులతో కాలక్షేపం చేయడం, కలిసి సినిమాలు చూడడం, చర్చలు జరపడం లాంటివి చేస్తూ ఉండాలి. సామాజిక సంబంధాలను పెంపొందించుకోవాలి.



ఎస్ఆర్ఎంకు ఎక్సలెంట్ ప్లేస్‌మెంట్ అవార్డు



కేంద్రమంత్రి రాజ్‌భూషణ్ చేతుల మీదుగా అవార్డును స్వీకరిస్తున్న డాక్టర్ వివేకానందన్

మంగళగిరి సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూని వర్సిటీకి మరో ప్రతిష్ఠాత్మకమైన పురస్కారం లభించింది. ఆసియా టుడే సంస్థ 15వ అంతర్జాతీయ విద్యా సదస్సును ఆదివారం సాయంత్రం న్యూఢిల్లీలో నిర్వహించింది. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి దేశ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల ప్లేస్‌మెంట్ గణాంకాలను పరిశీలించి, బెస్ట్ ప్లేస్‌మెంట్ టైటిల్‌ను ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి ప్రకటించింది. గరిష్ఠంగా రూ.50 లక్షల వార్షిక వేతనంతో కూడిన ప్లేస్‌మెంట్ కైవసం చేసుకోవడమే కాకుండా వంద శాతం ప్లేస్‌మెంట్ రికార్డును వర్సిటీ సొంతం చేసుకుంది. సగటున రూ.9.38 లక్షల వార్షిక వేతనాలు విద్యార్థులకు లభించేలా శిక్షణ అందించింది. ఇంజినీరింగ్ విద్యార్థులకే కాకుండా బీకాం, బీబీఏ, ఎంబీఏ, ఎంటెక్ విద్యార్థులు సైతం సగటున రూ.31 లక్షల వార్షిక వేతనం కింద ఉద్యోగాలు సాధించారు. ఎస్ఆర్ఎం కార్పొరేట్ రిలేషన్స్ అండ్ కెరీర్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ వివేకానందన్.. కేంద్ర జలశక్తి మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి, ఫిజి రిపబ్లిక్ హైకమిషన్ కౌన్సిలర్ నీలేష్ రోనిల్, ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా వివేకానందను అభినందించారు.

ఒంగోలు జాతి పరిరక్షణకే బల ప్రదర్శన పోటీలు

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్(చేబ్రోలు)మే 5 : ఒంగోలు జాతి ఎడ్ల పరిరక్షణకే జాతీయస్థాయి ఎడ్ల పందేలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. వడ్లమూడిలో ధూళిపాళ్ల వీరయ్య చౌదరి మెమోరియల్ వృషభ రాజాల బల ప్రదర్శన పోటీలు సోమవారం ఐదవ రోజుకు చేరుకున్నాయి. న్యూ కేటగిరి విభాగంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన 13 జతల ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. 1,400 కిలోల బండను లాగి హోరాహోరీగా తలపడ్డాయి. ఎడ్ల పందేల ప్రాంగణం జన జాతరను తలపించింది. 5వ రోజు ఎమ్మెల్యే



ఎడ్ల పెంపకం దార్లకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ క్రిస్టీనా తదితరులు

ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రైతులకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేసి, అనంతరం హెనీ క్రిస్టీనా మాట్లాడారు. రైతులను ప్రోత్సహించే విధంగా బల ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీలను ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఒంగోలు జాతి పరిక్షరక్షణకు ఈ పోటీలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామన్నారు. నేటి యువత ఒంగోలు జాతి ఎడ్ల విశిష్టతను గుర్తించి, ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. సంగం పాలక వర్గ సభ్యులు, పలువురు ప్రముఖులు పోటీలను వీక్షించారు.

ప్రజాదర్బార్‌కు పోటెత్తిన అర్జీదారులు

● 61వ రోజు వినతులు స్వీకరించిన మంత్రి లోకేశ్



వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి (ఉండవల్లి), మే 5, (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ సోమవారంతో 61వ రోజుకు చేరుకుంది. తమ సమస్యలు విన్నవించేందుకు వివిధ జిల్లాల నుంచి పెద్దఎత్తున అర్జీదారులు ఉండవల్లిలోని మంత్రి లోకేశ్ నివాసానికి తరలివచ్చారు. అందరిని ఆప్యాయంగా పలుకరిస్తూ వారి నుండి అర్జీలు స్వీకరించి, త్వరితగతిన పరిష్కారం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పలు అర్జీలకు సంబంధించి అప్పటికప్పుడే పరిష్కారానికి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

వైసీపీ హయాంలో భూమి అన్యాక్రాంతం చేశారు

వైసీపీ హయాంలో ఇళ్ల స్థలాల పేరుతో తమ 34 సెంట్ల భూమిని అధికారులు అన్యాక్రాంతం చేశారని, విచారించి తగు న్యాయం చేయాలని పల్నాడు జిల్లా రొంపిచర్ల గ్రామానికి చెందిన పడాల రాములు మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని తమకున్న ఏకైక ఆధారాన్ని రక్షించాలని కోరగా పరిశీలించి తగు న్యాయం చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని అంబేద్కర్ యూనివర్సిటీలో తన భర్త పని చేస్తూ.. కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడని, కారుణ్య నియామకం కింద తనకు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని చిలకపాలెం గ్రామానికి చెందిన డి.రేవతి మంత్రి లోకేశ్‌కు విన్నవించారు. పరిశీలించి న్యాయం చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుని, సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు పరిపాలన అనుమతులు మంజూరు చేయాలని సమైక్య యూత్ ప్రతినిధులు మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. శాఖపరమైన పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయని తెలిపారు.బీఎస్సీ నర్సింగ్ చదివిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని ఒంగోలు పట్టణం, మామిడిపాలేనికి చెందిన మౌనిక మంత్రికి విజ్ఞప్తి చేసింది. పుట్టుకతోనే దివ్యాంగుడైన తన



దివ్యాంగుల నుంచి వినతిపత్రం స్వీకరించి మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్

కుమారుడికి పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని పోరంకికి చెందిన ఐ.వరప్రసాద్ విన్నవించారు. గత వైసీపీ హయాంలో ఎన్టీఆర్ జిల్లా కవులూరులో తనకు నివేశన స్థలం మంజూరు చేసి, ఇంటి పట్టా ఇచ్చారని, కానీ, ఈ రోజు వరకు స్థలాన్ని చూపించలేదని జక్కంపూడికి చెందిన అన్నమ రాజు ముత్యాలు అర్జీ సమర్పించారు. 2017-18లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థు లకు న్యాయం చేయాలని ఏపీ అసిస్టెంట్ ప్రొఫెసర్ క్వాలిఫైడ్ ప్రతినిధులు మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. కడప, రేణిగుంట మధ్య జాతీయ రహదారి 716 విస్తరణలో భాగంగా తన ఇంటిని అధికారులు సేకరించారని, అయితే ఇంటి నిర్మాణానికి మా శ్రమే నష్టరి హారం ఇచ్చి.. స్థలానికి ఇవ్వకుండా వైసీపీ హ యాంలోని భూ సేకరణ అధికారులు వేధిస్తు న్నారని తిరుపతి జిల్లా, కరకంబాడికి చెందిన సుబ్రహ్మణ్యం మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో పరిశీలించి న్యాయం చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. కాగా అర్జీలు ఇచ్చేందుకు పలువురు దివ్యాంగులు రాగా లోకేశ్ స్వ యంగా వారి దగ్గరకే వెళ్లి వినతిపత్రాలు స్వీకరించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఆరోగ్య శాఖలో కలకలం

జీవో నంబరు 143కు వ్యతిరేకంగా బదిలీలు

23 మందికి సమన్లు, నేడు, రేపు విచారణ

గుంటూరు సిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో కలకలం రేగింది. గుంటూరు రీజినల్ డైరెక్టర్ పరిధి లోని 23 మంది ఉద్యోగులకు సమన్లు జారీ అయ్యాయి. మంగళ, బుధవారాల్లో ఆర్డీ కార్యాలయంలో జరగనున్న విచారణకు హాజరు కావాలని అందులో పొందుపరిచారు. జీఓ నంబరు 143కి విరుద్ధంగా బదిలీలు, డిప్యూటేషన్లు జరిగినట్లు తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మలినేని భానుమూర్తి ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆర్డీ కార్యాలయంలో కొందరు అధికారులు అక్రమ బదిలీలకు తెరలేపడం వివాదాస్పదమైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ నేతల పలుకుబడితో ఆయా పోస్టుల్లోకి వచ్చిన అధికారులు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి.

అన్నీ ఆయనే..

సదరు జీఓ ప్రకారం ఒకే క్యాడర్ లో ఇద్దరు ఉద్యోగులు ఉంటేనే బదిలీ చేయాలి. ఆర్డీ కార్యాలయం అధికారులు ఆ నిబంధనను పక్కన పెట్టేశారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగుల వద్ద పెద్ద మొత్తంలో పుచ్చుకొని ఒకే క్యాడర్ కేవలం ఒక్కరు ఉన్నా కూడా తాత్కాలిక బదిలీ) చేశారు. ఆర్డీ కార్యాల యంలో ఉన్న అధికారిణిని పక్కన పెట్టేసి కొందరు ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కృష్ణా జిల్లాకు చెందిన వైసీపీ ముఖ్య నేత కొడాలి నాని సిఫార్సుతో ఆర్డీ కార్యాలయంలో తిష్ట వేసిన అధికారి కనుసన్నల్లోనే ఇలాంటి అక్రమాలు ఎక్కువగా జరిగినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం మారినా.. అదే అధికారి కార్యాలయంలో సర్వం తానై నడుపుతుండడంతో మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రస్థాయి అధికారికి విచారణ బాధ్యతలు అప్పగించారు.

స్కార్పియో ఢీకొని.. ద్విచక్ర వాహనదారుడి మృతి

కర్లపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి): స్కార్పియో ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన కర్లపాలెం మండలం యాజలి సెంటర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్సై రవీంద్ర కథనం ప్రకారం పిట్టలవానిపాలెం మండలం అలకాపురానికి చెందిన కుసపూడి కృష్ణంరాజు (59) ద్విచక్ర వాహనంపై కర్లపాలెం వైపు వస్తున్నాడు. కర్లపాలెం వైపు నుంచి చందోలు వెళ్తున్న స్కార్పియో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణంరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రవీంద్ర ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి కొడుకు నాగ మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. స్కార్పియో వాహనాన్ని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ : కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు (విద్య) మే 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణపై నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

రు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చూడా లన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 23,279 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 3,883 మంది విద్యార్థులు హాజరు అవుతారని చెప్పారు. ప్రశ్నపత్రాల భద్రత, పరీక్ష కేంద్రాలకు పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్రాలకు ఆర్టీసీ అధికారులు బస్సులను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఏర్పాటు చేసి, ఏఎన్ఎంను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ భార్గవతేజ, ఆర్ఐఓ జుబేర్, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, డీఆర్ఓ ఎన్.ఎస్.కే ఖాజావలి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ఆదర్శ గ్రామాల ప్రకటనలో అలసత్వం

- చేస్తే 100 శాతం కేంద్రం నిధులు వచ్చే అవకాశం
- గ్రామాల అభివృద్ధి ప్రణాళికల ఆమోదం పెండింగ్
- సత్వరమే డీఎల్‌సీసీ మీటింగ్‌లు పెట్టాలని ప్రభుత్వం ఆదేశాలు

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన(పీఎంఏజీవై) పథకం కింద ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆదర్శ గ్రామాల ప్రకటనలో జాప్యం జరుగుతోంది. దీని వల్ల కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సిన గ్యాప్ ఫిల్లింగ్(జీఎఫ్) ఫండ్స్ రావడం లేదు. మూడు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. విలేజ్ డెవలప్‌మెంట్ ప్లాన్స్(వీడీపీలు) సిద్ధమైనప్పటికీ వాటిని జిల్లా స్థాయి కన్వర్జన్స్ కమిటీ(డీఎల్‌సీసీ) ఆమోదించి ప్రకటించాల్సి ఉంది. కారణాలేమైనా.. సమావేశాలు సక్రమంగా జరగకపోతుండడంతో.. ఈ పథకం నుంచి ఎక్కువ మొత్తంలో గ్రామ పంచాయతీలకు నిధులు తెచ్చుకొనే పరిస్థితి లేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో తక్షణమే మూడు జిల్లాల కలెక్టర్లు కన్వర్జన్స్ కమిటీల మీటింగ్‌లు ఏర్పాటు చేసి, వీడీపీలు ఆమోదించి ఆదర్శ గ్రామాలను ప్రకటించాలని, తద్వారా అదనపు నిధులు కేంద్రం నుంచి తెచ్చుకోవచ్చని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

వీడీపీల ఆమోదం పెండింగ్..

తరతరాలుగా విద్య, సంపదలో వెనకబడిపోయిన ఎస్సీలను పైకి తీసుకురావడానికి పీఎంఏజీవై పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను వారికి వర్తింపజేయడంతో పాటు గ్యాప్ ఫిల్లింగ్ ఫండ్స్‌ని విడుదల చేస్తుంది. ఒక్కో గ్రామానికి రూ. 20 లక్షల వరకు నిధులు తెచ్చుకొనే అవకాశం ఈ పథకం ద్వారా లభిస్తుంది. యూపీఏ ప్రభుత్వ హయాంలోనే ఈ స్కీమ్ ప్రారంభమైనప్పటికీ ఎన్డీఏ ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఈ స్కీమ్ కింద గుంటూరు జిల్లాలో 39 గ్రామాలను ఎంపిక చేయగా వీడీపీలను అన్నింటికి తయారు చేశారు. వీడీపీలు ఆమోదం విషయానికి వచ్చేసరికి 15 ఆమోదించి 24 పెండింగ్‌లో పెట్టారు. దీంతో ఆదర్శ గ్రామాలను సంపూర్ణంగా ప్రకటించలేక



పీఎంఏజీవై లోగో

పోయారు. ఇదేవిధంగా పల్నాడు జిల్లాలో 21 గ్రామాలను ఎంపిక చేసి వీడీపీలను తయారు చేశారు. అయితే ఇప్పటి వరకు ఎనిమిదింటిని మాత్రమే ప్రకటరించారు. 13 గ్రామాలను పెండింగ్‌లో పెట్టారు. బాపట్ల జిల్లాలో అత్యధికంగా 58 గ్రామాలను ఎంపిక చేసి వీడీపీలను 46 గ్రామాలకు సిద్ధం చేశారు. వాటిల్లో 15 మాత్రమే ఆమోదించి 43 పెండింగ్‌లో ఉంచారు. వీటిల్లో తొమ్మిది గ్రామాలను మాత్రమే ఆదర్శవంతమైనవిగా ప్రకటించారు.

118 గ్రామాలకు..రూ.23.60 కోట్లు

కాగా గుంటూరులో మూడు గ్రామాలకు సంబంధించి గ్యాప్ ఫిల్లింగ్ ఫండ్ కింద రూ. 80 లక్షలు విడుదల కాగా ఇప్పటివరకు వాటిని ఖర్చు చేయలేకపోయారు. ఈ నేపథ్యంలో తక్షణమే జడ్పీ సీఈవో/పంచాయతీ రాజ్ ఈఈలకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్‌ని ప్రభుత్వం ఆదేశించింది. మూడు జిల్లాలు కలిపి 118 గ్రామాలను ఆదర్శంగా ప్రకటించుకోగలిగితే రూ.23.60 కోట్ల నిధులను కేంద్రం నుంచి తెచ్చుకొని గ్యాప్ ఫిల్లింగ్ వర్కులకు ఉపయోగించుకొనే అవకాశం ఉంటుంది. ఇందుకు కేంద్రం జారీ చేసిన నిబంధనలకు అనుగుణంగా విలేజ్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లు రూపొందించి జిల్లా స్థాయి కన్వర్జన్స్ మీటింగ్‌ల్లో ఆమోదం తీసుకొని ఆఖరుగా వాటిని ఆదర్శ గ్రామాలుగా ప్రకటిస్తే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించి నిధులు విడుదల చేయిస్తుంది.

పని ఒత్తిడి తట్టుకోలేక ఏఎన్ఎం ఆత్మహత్య



మల్లోలు కోటేశ్వరమ్మ(ఫైల్)

రేపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): పని ఒత్తిడి తట్టుకోలేక చనిపోతున్నట్లు లేఖ రాసి పట్టణంలోని 5వ వార్డు సచివాలయంలో పనిచేస్తున్న ఏఎన్ఎం మల్లోలు కోటేశ్వరమ్మ(27) ఆదివారం రాత్రి ఉరివేసుకుంది. సమాచారం మేరకు.. పట్టణ సీఐ మల్లికార్జున సోమవారం ఘటనా స్థలాన్ని పరిశీలించి, మీడియాకు వివరా లు వెల్లడించారు. లంకెవానిదిబ్బ గ్రామానికి చెందిన సింగోకు సుశీల, బుల్లికోటయ్య మూడో కుమార్తె కోటేశ్వరమ్మకు మూడేళ్ల క్రితం నిజాంపట్నం మండలం దిండి గ్రామానికి చెందిన మల్లోలు గోపితో వివాహం జరిగింది. భర్త గోపి నిజాంపట్నంలో ప్రయివేటు టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భార్యాభర్తలు 5వ వార్డులో నివాసం ఉంటున్నారు. కోటేశ్వరమ్మ స్థానిక సచివాలయంలోనే ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో పని ఒత్తిడి కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ లేఖ రాసి ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. సోమవారం తెల్లవారుజామున భర్త గోపి చూసేసరికి భార్య ఫ్యాన్‌కు వేలాడుతూ.. కనబడటంతో చుట్టుపక్కల వారిని పిలిచి, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ మల్లికార్జునరావు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కోటేశ్వరమ్మ తల్లి సింగోకు సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతురాలికి ఒక కుమార్తె ఉంది.

కోటేశ్వరమ్మ మృతితో తీవ్ర దిగ్భ్రాంతి

గుంటూరు సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఏఎన్ఎం కోటేశ్వరమ్మ పని ఒత్తిడితో ఆత్మహత్యకు పాల్పడడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాదల అప్పారావు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. త్వరలోనే పని ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉందని, ఏఎన్ఎంలు ధైర్యంగా ఉండాలని సూచించారు. అధికారులు మరీ తట్టుకోలేని ఒత్తిడి తెస్తే.. జిల్లా కమిటీ దృష్టికి తీసుకురావాలని కోరారు. కోటేశ్వరమ్మలా తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. యూనియన్ నాయకులు.. కోటేశ్వరమ్మ ఆత్మకు శాంతి కలగాలని శ్రద్ధాంజలి ఘటించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు భక్తుల కోసం ఆర్టీసీ స్పెషల్ హైటెక్ 2+2 పుష్ బ్యాక్ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 10న రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 11న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని.. రాత్రి అక్కడే బస చేసి 12న పౌర్ణమి రోజున అరుణాచలానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. అదే రోజున అరుణచలేశ్వరుని దర్శించుకొని సాయంత్రం బయల్దేరి 13న ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందని తెలిపారు. 96164 సర్వీసుకు ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. టికెట్ ధర రూ. 2,420 మాత్రమేనని, అదనపు సమాచారం కోసం 73828 97459, 73828 96403 సంప్రదించాలని తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 5 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 513.90 అడుగులు ఉంది. ఇది 138.38 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తు న్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	145, 154, 165
చికెన్ విత్ స్కిన్(కిలో)	280.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	290.00

1,33,870 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,38,347 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,33,870 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 44,723 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	13800
334	9500	13200	షార్క్-1	10000	12000
నంబరు.5	10000	12500	బ్యాడిగి 355	10000	13000
273	10000	12400	సింజెంటా బ్యాడిగి 5531	--	--
341	10000	13300	దేవనూరుడీలక్స్	10000	12600
4884	10000	11200	ఆర్మూరు	9800	11200
సూపర్10	---	---	తాలుకాయలు	4500	6500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ఘనంగా వాసవి అమ్మవారి జన్మదిన వేడుకలు


వాసవి అమ్మవారికి నిమ్మకాయలతో ప్రత్యేక అలంకరణ

పిడుగురాళ్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన సందర్భంగా నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారిని నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు కుంకుమ పూజలో పాల్గొన్నారు. కార్యక్రమాలలో అధ్యక్షుడు యేలూరి చంద్రశేఖరరావు, జూలకంటి సుబ్రహ్మణ్యం, కొత్తూరు ఆంజనేయులు, కొలిశెట్టి సుబ్బారావు, కొత్త లక్ష్మీనారాయణ, కొలిశెట్టి కోదండరామయ్య, కట్టమూరి శంకరరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో విజిలెన్స్ విచారణ

సత్తెనపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో విజయవాడ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన విజిలెన్స్ బృందం సోమవారం విచారణ జరిపింది. డిపోలోని డీఎం, మరో ఇరువురు సిబ్బందిపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో విజిలెన్స్ బృందం స్థానిక ఆర్టీసీ డిపోలో కొంతమంది ఉద్యోగులను పిలిచి విచారణ చేశారు. డిపోలో విజిలెన్స్ విచారణ కార్మికుల్లో చర్చనీయాంశంగా మారింది.

దాచేపల్లి జీడీసీసీబీలో ఆధార్ సెంటర్

దాచేపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురం, ఎంఎస్ పేట జీడీసీసీ బ్యాంకులో సోమవారం ఆధార్ క్యాంపును ఏర్పాటుచేశారు. 8వ తేదీ వరకు అలాగే 12నుంచి 15వ తేదీ వరకు క్యాంపులు నిర్వహించనున్నారు. 5 నుంచి 7 ఏళ్ల వయసు, 15 నుంచి 17 ఏళ్ల వయసు గల చిన్నారుల కోసం ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పీఐజీ కడప శ్రీనివాసరావు తెలిపారు. జీడీసీసీబీ మేనేజర్ ఖాదర్‌బాబు, సూపర్‌వైజర్ ముక్కపాటి శ్రీనివాసరావు, సీఈవో సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పాకాలపాడు పీఏసీఎస్‌లో...

సత్తెనపల్లి రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ఆధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాకాలపాడు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ఎంవీ నరసయ్య అన్నారు. మండలంలోని పాకాలపాడు పీఏసీఎస్‌లో సోమవారం ఆధార్ నమోదు కేంద్రం నిర్వహించారు. అడ్రస్ మార్పులు, వయస్సు కొత్త ఆధార్, ఆధార్ బయోమెట్రిక్ వంటివి చేశారు. కార్యక్రమంలో సచివాలయ డీఏ చలపతిరావు, పీఏసీఎస్ సీఈవో సాయిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

సత్తెనపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి శాఖ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించి జ్ఞాపికలను, నగదు పారితోషికాన్ని అందించారు. 20మంది విద్యార్థినులను నేతలు సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ, బాలికల హైస్కూల్ హెచ్‌ఎం మాధవిలత, శివపార్వతి, కేబీఆర్‌జే ప్రసాదు, మురహరిరావు, కమలాకరరావు తదితరులు పాల్గొన్నారు. జడ్పీ బాలికల హైస్కూలు హెచ్‌ఎం మాధవీలత, తెలుగు పండిట్ శివపార్వతిలను అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు.

నేడు మండల సర్వ సభ్య సమావేశం

రాజుపాలెం, మే 5(ఆంధ్రజ్యోతి): నేడు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యానారాయణ తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

8న కారంపూడిలో..

కారంపూడి, మే 5(ఆంధ్రజ్యోతి): కారంపూడిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 8వ తేదీన ఎంపీపీ ఎం శారద అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, జడ్పీటీసీ, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఉపాధ్యాయుల నిరసన



తహసీల్దార్ కార్యాలయ వద్ద ఆందోళన చేస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

సత్తెనపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యారంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న అసంబద్ధ విధానాలను వ్యతిరేకించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ప్రదర్శనలో పాల్గొన్న ఉపాధ్యాయ నేతలు మాట్లాడుతూ పాఠశాల విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. సంస్కరణల పేరుతో గత ప్రభుత్వం 3, 4, 5 తరగతులను సమీప ఉన్నత పాఠశాలల్లో చేర్చి విద్యారంగాన్ని ధ్వంసం చేస్తే నేటి ప్రభుత్వం అదనంగా ఒకటి, రెండు తరగతులు కూడా ఉన్నత పాఠశాలల్లో కలపటం మోసం చేయటమేనన్నారు. తొమ్మిది రకాల పాఠశాలల ఏర్పాటుకు పూనుకోవటం ప్రభుత్వం విద్యారంగాన్ని ధ్వంసం చేయటం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం, డీ శ్రీనివాసరావు, దర్మారావు, హఫీజ్, రవి కుమార్, ఉదయ్‌కిరణ్, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ చక్రవర్తికి అందించారు.

సంగం జాగర్లమూడిలో సత్తాచాటిన కేశానుపల్లి ఎడ్లజత

దాచేపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గం సంగం జాగర్లమూడి క్వారీలో జరిగిన రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీల్లో దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన ఎడ్లజత సోమవారం మొదటిస్థానంలో నిలిచింది. ఎడ్లజత యజమాని నెల్లూరి రామకోటయ్యను పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర సన్మానించి షీల్డ్ బహూకరించారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఎడ్లజత యజమానిని అభినందించారు.


పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర నుంచి ప్రథమ బహుమతి అందుకుంటున్న ఎడ్లజత యజమాని నెల్లూరి రామకోటయ్య

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు


పెదకూరపాడులో శిథిలావస్థకు చేరిన కచేరి భవనం

పెదకూరపాడు, మే 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్‌ఐ), కచేరి సెంటర్(వీఆర్వో) కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా ఉన్నాయి. ఆర్‌ఐ ప్రజలకు అందుబాటులో ఉండేందుకు దశాబ్దాల క్రితం ఈ కార్యాలయాన్ని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనం నిరుపయోగంగా మారింది. ఒక వైపు గోడ కూడా కూలిపడి ప్రమాదకరంగా మారింది. ఈ భవనం వద్ద ఉన్న బెంచీలపై స్థానికులు నిత్యం కూర్చుంటారు. ఈ భవనం ఎప్పుడు కూలుతుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెదకూరపాడు లోని ప్రధాన సెంటర్లో స్వర్గీయ ఉన్నవ నాయుడు దాతృతంగా ఇచ్చిన స్థలంలో దశాబ్దాల క్రితం కచేరి సెంటర్ నిర్మించి ప్రజలకు రెవెన్యూసేవలందించారు. ఈ కచేరి సెంటర్లో కొంతకాలం విలేజ్ రెవెన్యూ అధికారి విధులు నిర్వహించారు. ఈ కచేరి సెంటర్ కూడా శిథిలావస్థకు చేరడంతో పాటు, పెచ్చులూడి ప్రమాదభరితంగా ఉంది. పెదకూరపాడు నుండి లగడపాడు, కన్నెగండ్ల గ్రామాలకు వెళ్లే ప్రజలు, విద్యార్థులు నిత్యం ఈ కచేరి సెంటర్ వద్ద నిలబడి ఆటోలు, ఆర్టీసీ బస్సుల కోసం ఎదురుచూస్తుంటారు. వర్షాకాలంలో భవనం లోపలికి వెళ్లి తల దాచుకుంటారు. శిథిలావస్థకు చేరిన ఈ భవనాలు ఎప్పుడు కూలి ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజల ఆందోళన చెందుతున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించి ఆర్‌ఐ, వీఆర్వో నూతన కార్యాలయాలు నిర్మించి ప్రజలకు రెవెన్యూసేవలను అందించాలని ప్రజల కోరుతున్నారు.


పెచ్చులూడిన కచేరి భవనం శ్లాబ్


శిథిలావస్థకు చేరిన ఆర్‌ఐ కార్యాలయం

టీడీపీ సంస్థాగత ఎన్నికలపై ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి దృష్టి

రెంటచింతల, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించి టీడీపీ సంస్థాగత ఎన్నికలపై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టి పెట్టారు. పార్టీ అధిష్టానం ఈనెల 18వ తేదీ నాటికి పూర్తిచేయాలని ఆదేశించడంతో సోమవారం ఎమ్మెల్యే మండలానికి చెందిన పలువురు నేతలతో ఫోన్లో మాట్లాడారు. గ్రామ అధ్యక్షుడు, మండల అధ్యక్షుడుతోపాటు రైతు విభాగం అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా సంఘ నేతలను నియమించాల్సి ఉంది. ఏ వర్గానికి ఇవ్వాలనే దానిపై ఎమ్మెల్యే పలువురి నుంచి సలహాలు స్వీకరించారు. రానున్న పంచాయతీ ఎన్నికలకు పార్టీని విజయపథాన నడిపించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

● ఎస్‌ఐ సుధీర్‌కుమార్

దుర్గి, మే 5(ఆంధ్రజ్యోతి): దొంగతనాలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సుధీర్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేసవి తాపాన్ని తాళలేక పల్లెటూర్లలో రాత్రి సమయాల్లో డాబాలపై నిద్రిస్తుంటారని, ఆ సమయాల్లో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇటువంటి సమయాల్లో ఇంటి తాళాలను భద్రపరుచుకోవాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు తమ వీధుల్లో సంచరిస్తున్నట్లయితే పోలీస్‌స్టేషన్‌కు తెలపాలన్నారు. ప్రతి కాలనీలో, ఇంటి పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు వారి వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందిస్తే పోలీసులు వారి ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచుతారన్నారు. విలువైన వస్తువులను తమతోపాటే తీసుకెళ్లాలని ఎస్‌ఐ సూచించారు.

ఆలయ భూములను సర్వే చేయాలి


తహసీల్దార్ మేరికి వినతిని అందజేస్తున్న ఈవో రామిరెడ్డి

రెంటచింతల, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న దేవదాయ, ధర్మాదాయ భూములను సర్వే చేయాలని ఎండోమెంట్ ఈవో గాదె రామిరెడ్డి కోరారు. సోమవారం తహసీల్దార్ మేరీ కనకంకు వినతిపత్రం అందించారు. ఆలయం కింద, అర్చకుల కింద వేలాది ఎకరాల భూములు ఉన్నాయని, అవన్నీ ఇరుగుపొరుగు ఆక్రమించుకోవడం వలన సమస్య జఠిలమైందన్నారు. ప్రభుత్వం తరుపున సర్వే చేసి హద్దులు నిర్ణయించడంలో రెవెన్యూ అధికారులు చొరవ చూపాలని కోరారు. ఆయన వెంట రాష్ట్ర అర్చక సంఘం నేత గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు తదితరులు ఉన్నారు.

6200 టిక్కీల మిర్చి అమ్మకం

దాచేపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డుకు సోమవారం 7300 మిర్చి టిక్కీలు రాగా 6200 టిక్కీలు అమ్మకాలు జరిగాయి. మిర్చి 334 రకం రూ.8వేల నుంచి రూ.12వేలు, తేజ రకం రూ.9వేల నుంచి రూ.13వేలు, తాలుకాయలు రూ.2వేల నుంచి రూ.7వేల వరకు అమ్మకాలు జరిగినట్లు మిర్చి యార్డు అధికారులు తెలిపారు.

భూసమస్యలను పరిష్కరించండి

కారంపూడి, మే 5(ఆంధ్రజ్యోతి): తొగట వీర క్షత్రియ సంఘ సభ్యుల భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘ రాష్ట్ర యువజన అధ్యక్షుడు నలమార అరుణ్‌బాబు కోరారు. సోమవారం సంఘ సభ్యులతో కలిసి తహసీల్దార్ వెంకటేశ్వర్లునాయక్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.నరసింహులు, నలమార అనంతలక్ష్మయ్య, నీలం సంజీవయ్య, నాగమల్లి, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రామకోటయ్యకు సన్మానం

మాచర్లటౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్ట్ పరివాహక ప్రాంతంలో నాటు పడవలపై ఆధారపడి జీవిస్తున్న వలసప్రాంతాలకు చెందిన సుమారు 500 కుటుంబాల చిన్నారులకు గత 25 ఏళ్లగా పోలియోచుక్కలు అందిస్తున్న పట్టణానికి చెందిన డాక్టర్ రామకోటయ్య దంపతులను రోటరీక్లబ్ ఆధ్వర్యాన ఆదివారం రాత్రి పట్టణంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాట్రగడ్డ శరత్‌చౌదరి, కేవీ రంగారావు, వీవీ రమణ, డాక్టర్ విష్ణుబాబు, సుమిత్రకుమార్, కృష్ణకుమారి, నిమ్మగడ్డ సురేఖ, అన్నపురెడ్డి లక్ష్మి, ఇక్కుర్తి శంకర్, టి.శ్రీనివాసరావు, పఠాన్ నాగూర్‌వలి, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీవాసవీ సేవాదళ్ ఆధ్వర్యాన అన్నదానం

కారంపూడి, మే 5(ఆంధ్రజ్యోతి): కారంపూడిలోని గాంధీబొమ్మ సెంటర్ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద శ్రీవాసవీ సేవాదళ్ ఆధ్వర్యాన సోమవారం అన్నదానం నిర్వహించారు. బొగ్గవరపు వెంకట సిద్ధార్థ, రిషన్స్ పుట్టినరోజు సందర్భంగా 300 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో బొగ్గవరపు శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి, రామకృష్ణ ప్రసాద్, సాయిప్రియాంక, భవిరిశెట్టి రామారావు, చిన్ని లక్ష్మి, మాడిశెట్టి పుష్పలత, భవిరిశెట్టి సీతామహాలక్ష్మి, పల్లా పద్మా, ఊటుకూరి వాణి, చిన్ని అనంతలక్ష్మి, సూరే ధనలక్ష్మి, చింతల శారద, గుండా మహేశ్వరి, బచ్చు నాగమణి, ఊటుకూరి వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ


కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ముప్పాళ్ల, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని వెలుగు కార్యాలయ ప్రాంగణంలో మహిళలకు కుట్టుశిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో మహిళలు అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం తొండపిలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, నాయకులు శిరిగిరి గోపాలరావు, మాజీ ఉప ఎంపిపి రావిపాటి మధుబాబు, కళ్లం విజయభాస్కరరెడ్డి, తహసీల్దార్ ఎం భవానీశంకర్, ఈవోపీఆర్డీ రూపవతి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు


ముత్తు మారియమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంకణాలపల్లి పంచాయతీ పరిధిలోని వావిలాలనగర్‌లో ఉన్న ముత్తుమారియమ్మన్ అమ్మవారిని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవంలో భాగంగా వేకువజామునుంచే ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట తెలుగురైతు రాష్ట్రకార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు, సోలా నంబీ, మోహన్, దరువూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తుల్జా భవానీ గిరిజన ఆలయం ధ్వంసం


గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన తుల్జా భవానీ మునేశ్వర స్వామి ఆలయం

అచ్చంపేట, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్లగూడెం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో 14వ శతాబ్దంలో నిర్మించిన శ్రీ తుల్జా భవానీ మునేశ్వరస్వామి దేవాలయాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనపై అఖిల భారతీయ గిరిజన వికాస్ పరిషత్ సంఘ ఉపాధ్యక్షుడు వాంకాడోత్ శ్రీనివాసనాయక్, కార్యవర్గ సభ్యులు బాణావత్ మురళీ నాయక్, మూడావత్ శివా నాయక్, గుగులోత్ సీతారామ్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన తుల్జా భవానీ అమ్మవారి ఆలయాన్ని ఆనవాళ్లు కూడా చెరిపివేసే ప్రయత్నం చేసిన ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. గిరిజనులపై దాడిగా భావిస్తున్నామని, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

హత్య కేసులో భర్త అరెస్టు


నిందితుడు అప్పారావును అరెస్ట్ చూపుతున్న దాచేపల్లి సీఐ భాస్కర రావు, పోలీసు కానిస్టేబుళ్లు

దాచేపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త ఉల్లేరు అప్పారావును పొందుగుల బోర్డర్ చెక్‌పోస్టు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు దాచేపల్లి సీఐ భాస్కరరావు సోమవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. ఈనెల 1వ తేదీన ఉల్లేరు అప్పారావు భార్య దుర్గపై అనుమానంతో నడికుడి శివారులోని అంబుజా సిమెంట్స్ భూముల్లోకి తీసుకెళ్లి ఆమె తలపై కొట్టి వెళ్లిపోయాడు. తీవ్ర గాయాలపాలైన దుర్గ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ కేసులో నిందితుడు అప్పారావును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు వివరించారు.

స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోండి..

క్రోసూరు, మే 5(ఆంధ్రజ్యోతి): క్రోసూరులోని ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాలలో నిర్వహించే రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షణ కోసం నిరుద్యోగ యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ కో-ఆర్డినేటర్ అంజిరెడ్డి తెలిపారు. 10వ తరగతి, ఆ పైన విద్యార్హత ఉండి 15నుంచి 45 సంవత్సరాల లోపు వయసున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రెండు నెలల కాలవ్యవధి ఉన్న కస్టర్ కేర్ ఎగ్జిక్యూటీవ్ డొమెస్టిక్ వాయిస్ శిక్షణ కోసం 60మందికి, డొమెస్టిక్ ఐటీ హెల్ప్‌డెస్క్ అటెండెంట్ శిక్షణ కోసం 60మందికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు ఆధార్, విద్యార్హత, రెండు పాస్‌ఫోర్టు సైజు ఫోటోలతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మే 20వ తేదీ లోపు దరఖాస్తులు పంపాల్సి ఉంటుందన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. వివరాలకు 77798 58789 నెంబరులో సంప్రదించాలని కోరారు. ట్రైనింగ్ పూర్తి కాగానే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

అర్థాంతరంగా నిలిచిన రహదారి విస్తరణ పనులు

● ఇబ్బందిపడుతున్న స్థానిక ప్రజలు

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): అమరావతి నుండి క్రోసూరు వెళ్లే మార్గంలో ధరణికోట గ్రామం నుండి ఆర్‌అండ్‌బీ అధికారులు చేపట్టిన రహదారి విస్తరణ పనులు అర్థాంతరంగా నిలిపివేయడంతో రహదారి వెంబడి నివాసాలవారు నరకయాతన అనుభవిస్తున్నారు. ధరణికోటలోని ఆర్‌వీవీఎన్ కళాశాల నుండి అమరావతి వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టి రహదారికి ఇరువైపుల అడ్డుగా ఉన్న కట్టడాలను తొలగిస్తూ 50 అడుగుల రహదారిగా ఏర్పాటుచేసి సైడు కాలువలు నిర్మించాల్సివుంది. ఈ క్రమంలో రోడ్డు వెంబడి 5 అడుగుల లోతు 5 అడుగుల వెడల్పుతో కాలువలు తీశారు. దీంతో రహదారి వెంబడి ఉన్న నివాసాలవారు ఇంటిలోనుండి బయటకు వచ్చే పరిస్థితి లేకుండాపోయింది. పనులను కాంట్రాక్టర్ అర్థాంతరంగా నిలిపివేసి వారాలు గడుస్తోంది. అంతేగాకుండా పోలీసు స్టేషన్ సమీపంలో ప్రధాన రహదారిపై కల్వర్ట్ నిర్మించేందుకు భారీ గుంతను తీసి పనులు నిలిపివేశారు. అక్కడ కూడా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులను వెంటనే పూర్తి చేసి తమ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


డ్రైయినేజీ కోసం ఇళ్ల ముందు తవ్వి వదిలేసిన దృశ్యం


కల్వర్ట్ నిర్మించేందుకు తవ్వి వదిలేసిన గుంత

బాలికల విద్యకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని తదితరులు

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

మాచవరం, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు, బాలికల విద్యాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని పిల్లుట్ల గ్రామంలో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో రూ.2.12కోట్ల వ్యయంతో హాస్టల్ గదుల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేజీబీవీకి పక్కనే మరో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అది కూడా పాఠశాలలో కలిపితే విద్యార్థినిలకు ఎక్కువ వసతులు కల్పించవచ్చని టీడీపీ గ్రామ నాయకులు నలబోతుల శ్రీను, బడుగుల శ్రీను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ తహసీల్దార్ నాగ మల్లేశ్వరరావును ఆ భూమికి సంబంధించి వివరాలు సేకరించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో టీఎన్ఎస్ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బాలు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వాదించారు. శంకుస్థాపన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, సర్వశిక్ష అభియాన్ ఈఈ కేవీ నాగజ్యోతి, ఈఈ ప్రభాకరరావు, ఏఈ సురేష్‌నాయక్, టీడీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంత నిధులైనా ఇస్తా.. గ్రామాన్ని అభివృద్ధి చేసుకోండి


చినఅగ్రహారం శివాలయంలో యరపతినేనిని ఆశీర్వదిస్తున్న అర్చకుడు

పిడుగురాళ్ల, మే 5(ఆంధ్రజ్యోతి): చిన అగ్రహారం గ్రామాన్ని అభివృద్ధి పరిచేందుకు ఎన్ని నిధులైనా ఇస్తానని, పార్టీలకు అతీతంగా ఐక్యతతో ముందుకు రావాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. చినఅగ్రహారంలో అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ఎమ్మెల్యే పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం యరపతినేనిని వేదపండితులు ఆశీర్వదించారు. ఆ తరువాత నిదానంపాటి అమ్మవారి దేవాలయంలో పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో గండికోట వెంకటేశ్వర్లు, మేకల రాంబాబు, మేకల సాంబశివరావు, మస్తాన్‌రావు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, తురకా వీరస్వామి, పిల్లి చెన్నారావు, బడిగుంచల వెంకటేశ్వర్లు, పణితి రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం


కోటమ్మకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, మే 5(ఆంధ్రజ్యోతి): డీకాల కోటమ్మకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆర్థికసాయం అందించారు. కోటమ్మ యరపతినేని అభిమాని. ఆయన పర్యటన, సభలు, సమావేశాలు నియోజకవర్గంలో ఎక్కడ జరిగినా వెళుతుంటుంది. చినఅగ్రహారం గ్రామానికి ఎమ్మెల్యే యరపతినేని ఎప్పుడువెళ్లినా కోటమ్మ ఇంటికెళ్లి యోగక్షేమాలు అడిగి ఆర్థికసాయం చేస్తూ ఉంటారు. ఆదివారం రాత్రి గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కొద్దిరోజుల క్రితం కోటమ్మ చేతికి గాయమైన విషయం తెలుసుకుని రూ.10వేలు అందజేశారు. ఇకపై ఆరోగ్య అవసరాలు, మందులకు కొంత నగదు పంపుతానని చెప్పారు.

వెంకటేశ్వర్లుకు యరపతినేని నివాళి

పిడుగురాళ్ల, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం మాజీ అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు మృతి బాధాకరమని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పిడుగురాళ్లలో వెంకటేశ్వర్లు మృతదేహానికి ఎమ్మెల్యే యరపతినేని ఆదివారం రాత్రి నివాళులర్పించారు. కార్యక్రమంలో బంగారు శ్రీను, సుతారు నాగమల్లేశ్వరరావు, మల్లెం నాసరాచారి, ఎం కోటేశ్వరరావు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రుణ మంజూరులో ప్రాధాన్యం కల్పించండి

అచ్చంపేట, మే 5(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రభుత్వ రుణాల మంజూరులో ప్రాధాన్యత కల్పించాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిర్రా రాజేష్ కుమార్ ఎంపీడీవో కే శ్రీనివాసరావుకు సోమవారం వినతిపత్రం అందించారు. దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం ప్రభుత్వం దివ్యాంగులకు ఉపాధి, ఆర్థిక సాయం తదితర రంగాల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని శాఖల్లో దివ్యాంగులకు రుణాల మంజూరులో ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మే 5(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 22.83 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

మైనార్టీల సంక్షేమమే టీడీపీ ధ్యేయం : మస్తాన్ షరీఫ్

బెల్లంకొండ, మే 5(ఆంధ్రజ్యోతి): మైనార్టీల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్‌షరీఫ్ పేర్కొన్నారు. సోమవారం బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో మైనార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు రుణాలు ఇచ్చేందుకు దరఖాస్తుల స్వీకరణకు సన్నాహాలు చేస్తుందన్నారు. సమావేశంలో టీడీపీ మండల యువత అధ్యక్షుడు సలాం, చిట్టి, సుభానీ, సయ్యద్ జానీ, పెద్ద హయూం, హసాన్, అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

కారంపూడి, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్ల గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడు, టీడీపీ అభిమాని పల్స్రారి ప్రసాద్ సోమవారం అనారోగ్య కారణాలతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి పంగులూరి పుల్లయ్య ప్రసాద్ భౌతికకాయానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం అందించారు. పంచాయతీ సిబ్బంది కూడా రూ.10వేల ఆర్థికసాయం అందించారు.

ఆస్తమాతో అప్రమత్తంగా ఉండాలి

సత్తెనపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): ఆస్తమా పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఊపిరితిత్తుల వ్యాధి నిపుణులు సింగరాజు సాయికృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక సాయికృష్ణ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన ప్రపంచ ఆస్తమా దినోత్సవం అన్నారు. రోజురోజుకు పెరుగుతున్న వాయుకాలుష్యం, ఆహారంలో వాడే రసాయనాల కారణంగా ఉబ్బసం వ్యాధి పెరుగుతోందన్నారు. శ్వాసలో ఇబ్బంది, చాతి బిగుతుగా అవ్వటం, పిల్లికూతలు తదితర వ్యాధి లక్షణాలు కన్పిస్తాయన్నా రు. ఈ లక్షణాలు తీవ్రరూపం దాల్చకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి పదిమంది పిల్లల్లో ఒకరు ఆస్తమా బారినపడుతున్నారన్నారు. సరైన మందులు వాడుకోవటం వల్ల దీనినుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఆయనతో పాటు డాక్టర్ సింగరాజు విద్య కూడా ఉన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ సింగరాజు సాయికృష్ణ

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

బర్లీ పొగాకు రైతుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ల ఏర్పాటు: కొల్లా

చిలకలూరిపేట, మే5 (ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకు రైతుల ప్రయోజనార్థం రాష్ట్ర వ్యవసాయ శాఖ టోల్ ఫ్రీ నెంబర్లను ఏర్పాటు చేసినట్టు నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహనరావు సోమవారం తెలిపారు. బర్లీ రైతులు తమ పొగాకును అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాల వివరాలను ఈ టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు. పొగాకు అమ్మకాల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే ఈ నంబర్లకు ఫోన్‌చేసి తెలపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఎన్ రమేష్ (వ్యవసాయ శాఖ) 83310 56024, కె.నాగలక్ష్మి (మార్కెటింగ్ శాఖ) 91823 61396, ఏ వంశీక్రిష్ణ (పొగాకు బోర్డు) 83318 32171, ఎన్.శ్రీనివాసరావు (ఇండియన్ టుబాకో అసోసియేషన్) 97033 80766కు తెలియజేయాలన్నారు.

హస్తినాపురం వీధిలైట్ల బిల్లులను మున్సిపాలిటీ చెల్లిస్తుంది: కమిషనర్

వినుకొండ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పురపాలక సంఘం పరిధిలోని హస్తినాపురం కాలనీ విద్యుత్ వీధిలైట్ల బిల్లులను మున్సిపాలిటీ చెల్లించాలని కాలనీ వాసులు సోమవారం మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో హస్తినాపురం వీధి లైట్ల బిల్లులను మున్సిపాలిటీ ద్వారా చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ కమిషనర్‌ను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.

సహకార వారోత్సవాల సందర్భంగా ఆధార్ క్యాంపు

రొంపిచర్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెంలోని విప్పర్ల పీఏసీఎస్‌లో సహకార వారోత్సవాల్లో భాగంగా ఆధార్ క్యాంపును సోమవారం నిర్వహించారు. 22 మందికి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేశారు. జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, జిల్లా సహకార శాఖ అధికారి వెంకట రమణ ఆదేశాల మేరకు ఈ క్యాంపు నిర్వహించినట్టు చైర్‌పర్సన్ మహేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది లక్ష్మీరెడ్డి, వీరారెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి: జనసేన జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు

వినుకొండ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లి మండలం విద్యుత్ శాఖ అధికారులు వ్యవసాయ భూమికి విద్యుత్ కనెక్షన్ల సమస్యను పరిష్కరించాలని జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి నిశ్శంకర శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కారంపూడి రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిశ్శంకర శ్రీనివాసరావు మాట్లాడుతూ బొల్లాపల్లి మండలం సరికొండపాలెం తండా సమీపంలోని 6.72ఎకరాల వ్యవసాయ భూమికి విద్యుత్ కనెక్షన్ కావాలని 2024 జూలై 10వ తేదీన దరఖాస్తు చేశామని 2024 సెప్టెంబరు 6వ తేదీన డబ్బులు చెల్లించి అందుకు సంబంధించిన రికార్డులను విద్యుత్ శాఖకు అందించినా నేటికి తన భూములకు ఏ విధమైన కనెక్షన్లు అందజేయలేదన్నారు. విద్యుత్ శాఖ అధికారులు తమ దరఖాస్తులను పరిశీలించి విద్యుత్ కనెక్షన్ అందించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.



మంత్రి నారా లోకేశ్‌తో డాక్టర్ కోడెల శివరామకృష్ణ

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన డాక్టర్ కోడెల శివరామకృష్ణ

నరసరావుపేట టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌ను తాడేపల్లిలోని ఆయన నివాసంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. పల్నాడు జిల్లాలో రాజకీయ పరిస్థితులు గురించి చర్చించారు. జిల్లాలో వివిధ అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

లోకేశ్‌ను కలిసిన నూజెండ్ల నాయకులు

నూజెండ్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మండల టీడీపీ నేతలు గంగినేని అంజనేయులు, ముంద్రు సుబ్బారావు, గంగినేని చంద్రశేఖర్, లగడపాటి హనుమంతరావులు సోమవారం కలసి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను పార్టీపరంగా చేపట్టిన కార్యక్రమాల గురించి తెలియజేసినట్టు తెలిపారు. యువగళం పాదయాత్ర వినుకొండ నియోజకవర్గంలో ప్రవేశించనున్న సమయంలో వైసీపీ నాయకులు తలపై గాయపరిచారని గంగినేని అంజనేయులు ఈ సందర్భంగా ఆ నాటి సంఘటనలను లోకేశ్‌కు వివరించారు. మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని గుర్తించి సముచిత స్థానాలు కల్పించాలని చేసిన విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించినట్టు టీడీపీ నాయకులు తెలిపారు.

8న కృష్ణాపురంలో విగ్రహాల ప్రతిష్ఠ

కృష్ణాపురం (శావల్యాపురం) మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోట్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కృష్ణాపురంలో నూతనంగా నిర్మించిన వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఈ నెల 8వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీసభ్యులు సోమవారం తెలిపారు. మంగళవారం నుంచి యజ్ఞాలు, యాగాలు, హోమాలతోపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

కలెక్టర్ అరుణ్‌బాబు



ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, ఇతర అధికారులు

నరసరావుపేట టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికల వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి 291 అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్‌వో మురళి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణ్‌బాబు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కర వేదికలో వచ్చే ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

వైసీపీకి మద్దతు పలికారని ఇబ్బంది పెడుతున్నారు: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

వైసీపీకి ఏకపక్షంగా మద్దతు పలికారని రొంపిచర్ల మండలం బుచ్చిబాపనపాలెంలో నాలుగు నెలలుగా తాగునీళ్ల ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం లేదన్నారు. గతంలో నియమించి గ్రీన్ అంబాసిడర్స్‌ను తొలగించి వేరే గ్రామాల నుంచి తీసుకొచ్చి పనిచేయించాలనే ఉద్దేశ్యంతో ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సొంత గ్రామం అని తాగునీళ్ల కూడా ఇవ్వటానికి వీలులేదని పంచాయతీ సెక్రటరీ మాట్లాడున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధలో బీసీ సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్‌ని ఎన్నుకున్నామని, ఎంపీటీసీని ఎన్నుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో బుచ్చిబాపనపాలెం గ్రామస్థులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

30 జీవోను అమలు చేయాలి

● మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా

పట్టణంలోని బాపనయ్య నగర్ వాసులకు 30 జీవోను అమలు చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ సోమవారం డిమాండ్ చేశారు. గత 20 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న బాపనయ్య నగర్ వాసుల గృహాలకు పట్టాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజే శారు. ఈ సందర్భంగా గోదా జాన్‌పాల్ మాట్లాడుతూ సంవత్సరాల తరబడి సెంటు స్థలం లేని పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు బాపనయ్య నగర్ ప్రాంతంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాన్ని శుభ్రం చేసుకొని గుడిసెలు వేసుకొని ఉంటున్న వారికి పన్నులువేసి, నీటి కుళాయిలు ఇచ్చారన్నారు. ఆ ప్రాంతంలో రోడ్లుకూడా వేశారని, కానీ నివసించే ఇళ్ళకు పట్టాలు కావాలని ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకండా పోయిందన్నారు. నేటి ప్రభుతవ్వం జీవో నెంబర్ 30 తీసుకువచ్చి అక్రమితదారులకు హక్కులు కల్పించాలని ఇచ్చిన జీవో బాలయ్యనగర్ వాసులకు అమలుచేసి సుమారు 150 కుటుంబాలకు హక్కులు కల్పించే దిశగా పట్టాలు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో గాడిపర్తి పాపారావు, తోట వెంకటేశ్వరరావు, శాఖమూరి కోటేశ్వరరావు, షేక్ కరీమ్, షేక్ హుస్సేన్, సామేలు. గుండాల రాజారమేష్, శ్రీను, మున్నా, సుబ్బారావు, నీలాంబరం తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు అండగా ఉంటా

వాసవి క్లబ్స్ నూతన సభ్యుల ప్రమాణస్వీకారంలో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



నూతనంగా ఎంపికైన వాసవి క్లబ్ నాయకులను సన్మానిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, మే 5 (ఆంధ్రజ్యోతి): వాసవి క్లబ్, వాసవి క్లబ్ వనిత, వాసవి క్లబ్ యూత్ 2025 నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం ఆదివారం రాత్రి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ముందుగా నూతన కార్యవర్గంచే వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ కజ్జాయం విజయలక్ష్మి ప్రమాణస్వీకారం చేయించారు. నూతన అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులతో జిల్లా గవర్నర్ మునగాల చిరంజీవి ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం జిల్లా గవర్నర్ మాట్లాడుతూ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అందజేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. కొన్ని వందల క్లబ్స్‌తో లక్షమంది సభ్యులతో ప్రతి సంవత్సరం కొన్ని కోట్ల రూపాయలు సేవా కార్యక్రమాలు సమాజానికి అందజేస్తున్నామన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు నూతనంగా ఎంపికైన సభ్యులను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాసవి క్లబ్స్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు శివశక్తి ఫౌండేషన్ అండగా ఉంటుందని, వాసవి క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం ఆర్యవైశ్య పేద విద్యార్థులకు నిమ్స్ 24 హాస్పటల్ డాక్టర్ కాసుల లక్ష్మీనారాయణరావు సౌజన్యంతో రూ.10వేలు ఆర్థికసాయాన్ని ఇద్దరు పేద విద్యార్థులకు జీవీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా ఇద్దరు ఆర్యవైశ్య జీవనోపాధి నిమిత్తం దాతలు పెండేల బ్రదర్స్ 2 వెట్ గ్రైండర్లు అందజేశారు. వారితో పాటు విజయకృష్ణ దాల్ మిల్లు అధినేత ఒక విద్యార్థికి రూ.7వేలు ఆర్థికసాయం అందజేశారు. దాతలను ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు.

కార్యక్రమంలో వెంకటశివరామకృష్ణ, వెల్లంపల్లి కేశవరావు, జిల్లా వైస్ గవర్నర్ గజవల్లి నాగపవన్‌కుమార్, జీవీ ఎల్ నాగేశ్వరరావు, పొత్తూరి రాము, మండవ వెంకటకిరణ్‌కుమార్, చిలంకూరి కోటేశ్వరరావు, వెంకట సత్యనారాయణతో పాటు వాసవి క్లబ్ సభ్యులు, ఆర్య వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

నవధాన్య విధానంతో భూమిని సారవంతం చేయాలి

ప్రకృతి వ్యవసాయ జిల్లా శిక్షకుడు సైదయ్య



కారుమంచిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కారుమంచి (శావల్యాపురం) మే 5 (ఆంధ్రజ్యోతి): రైతులంతా తమకున్న పొలాల్లో నవధాన్య విధానాన్ని అనుసరించి భూమిని సారవంతం చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా శిక్షకులు సైదయ్య తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు మండలంలోని కారుమంచిలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. సైదయ్య మాట్లాడుతూ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం 2025-26 ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ నిర్వహించం జరుగుతుందని, రైతులు, వ్యవసాయ కూలీలంతా తమపేర్లను నమోదు చేసుకోవాలన్నారు. రైతులు ఆచరిస్తున్న వ్యవసాయ విధానాల వల్ల భూమిలో కార్బన్‌శాతం 0.5శాతం కంటే తగ్గి పొలాల్లో వేసే రసాయనిక ఎరువులను పంటలు తీసుకొనే పరిస్థితి లేదని, నవధాన్య విధానాన్ని అనుసరించడం వల్ల భూమిలో కార్బన్ శాతం పెరిగి పంటలకు చీడపురుగుల ఉధృతి కూడా తగ్గుతుందన్నారు. మాస్టర్ ట్రైనర్ తిరుపతిరావు, మాట్లాడుతూ రైతులు పొలాల్లో ఏటీఎం మోడల్స్ అనుసరించి వారి కుటుంబానికి అవసరమైన ఆకుకూరలు, కూరగాయలు, దుంపజాతి వంటి ఆరోగ్యవంతమైన పంటలు పండించాలన్నారు. జిల్లా శిక్షకులు మేరీకుమారి, యూనిట్ ఇన్‌చార్జిలు శివలక్ష్మి, లక్ష్మీదుర్గ, వేణుగోపాలరావు పాల్గొన్నారు.



వీ అప్పాపురంలో ప్రకృతి వ్యవసాయ ర్యాలీలో పాల్గొన్న వ్యవసాయ సిబ్బంది, రైతులు

ప్రకృతి వ్యవసాయంతో ప్రతి నిత్యం ఆదాయం

నూజెండ్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో ప్రతి రోజు ఆదాయం వచ్చేలా ఏటీఎం విధానంలో కూరగాయల సాగు లాభసాటిగా ఉంటుందని మాస్టర్ ట్రైనర్ బీ తిరుపతిరావు అన్నారు. మండలంలోని వీ అప్పాపురంలో సోమవారం ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రైతులతో సమావేశమై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ములకలూరు డీసీ చైర్మన్ నక్కా బుల్లీశ్వరరెడ్డి, గ్రామ వ్యవసాయ హాయకుడు అశోక్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శివలక్ష్మి, రోసిరెడ్డి, వేణుగోపాలరావు, లక్ష్మణ నాయక్, నాగరాజు, వెంకాయమ్మ పాల్గొన్నారు.

వయ్యకల్లు సీసీరోడ్డు నిర్మాణంలో ఉద్రిక్తత



సీసీరోడ్డు నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న పోలీసులు

వయ్యకల్లు (శావల్యాపురం) మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వయ్యకల్లులో ఇరుకుటుంబాల మధ్య 15 ఏళ్ళుగా వివాదంలోనున్న స్థలంలో సోమవారం ఎట్టకేలకు పోలీసుల పర్యవేక్షణలో ఆక్రమణలను తొలగించి సీసీరోడ్డును నిర్మించారు. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన ఆళ్ళ కోటేశ్వరరావు, ఆళ్ళ శ్రీనివాసరావు, నెల్లూరి సురేష్‌లు సర్వేనెంబర్ 795లోని స్థలంలో ప్రక్కప్రక్కన ఇళ్ళు కట్టుకొని నివాసముంటున్నారు. సురేష్ ఇంటిముందున్న స్థలాన్ని కోటేశ్వరరావు తనదంటూ ఆక్రమించుకొని రాళ్ళు, బండలు వేసి 15ఏళ్ళుగా సురేష్ కుటుంబసభ్యులను ఆ మార్గంలో తిరగకుండా అడ్డుకొంటున్నాడు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సురేష్ ఇంటిని వదిలేసి తన ఇంటివరకు పంచాయతీ తరఫున సీసీరోడ్డును వేయించుకొన్నాడు. దాంతో ఇరు కుటుంబాలమధ్య వివాదాలు జరుగుతున్నాయి. ఇటీవల సురేష్ ఈ విషయాన్ని గ్రామసర్పంచ్ గోనుగుంట్ల వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్ళగా సురేష్ ఇంటి ముందు ఆక్రమణలు తొలగించి సీసీరోడ్డు వేయడానికి సిద్ధం చేశాడు. విషయం తెలుసుకొన్న కోటేశ్వరరావు 785 సర్వేనెంబర్‌లో తన స్థలంఉందని, తన సొంత స్థలంలో సీసీరోడ్డు వేయడానికి వీలులేదని కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చాడు. దాంతో సర్పంచ్ వెంకటేశ్వర్లు రెవెన్యూ అధికారులతో సర్వే చేయించగా స్థలం, ఇద్దరి ఇళ్ళు కూడా గ్రామకంఠంలో ఉన్నట్లు తేలింది. కోర్టు స్టే ముగియగానే పంచాయతీ కార్యదర్శి పోలీసులకు బందోబస్తు నడుమ ఆక్రమణలు తొలగించి సోమవారం సీసీరోడ్డును నిర్మించారు. ఆక్రమణలను తొలగించేందుకు వచ్చిన అధికారులను, పోలీసులను ఆళ్ళ కోటేశ్వరరావు కుటుంబసభ్యులు తమ స్థలంలో సీసీ రోడ్డు వేయడానికి వీలులేదని అడ్డుకోవడంతో కొంతసేపు గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు కావాలనే తమపై కక్ష గట్టి తమ సొంత స్థలంలో సీసీరోడ్డు నిర్మిస్తున్నారని, అడ్డువచ్చిన తమను పక్కకు నెట్టేసి దౌర్జన్యం చేశారని ఆరోపించారు. పోలీసులు వారిని వారించి ఆక్రమణలు తొలగించి సీసీరోడ్డు నిర్మాణం పూర్తయ్యేవరకు పర్యవేక్షణ చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావును వివరణ కోరగా సీసీరోడ్డు నిర్మాణంలో ఎటువంటి రాజకీయ పరమైన కోణం లేదన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఐ

చిలకలూరిపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాల దృష్ట్యా వేసవిలో దొంగతనాలు జరగడానికి ఎక్కువ అవకాశాలు ఉన్న దృష్ట్యా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చిలకలూరిపేట అర్బన్ సీఐ పి.రమేష్ సోమవారం కోరారు. వివిధ కారణాల వలన ఇళ్ళు వదిలి వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. అపార్టుమెంట్లలో సీసీ కెమెరాలు లేకపోవడం, వాచ్‌మెన్‌లు అజాగ్రత్తగా ఉండటం వంటి కారణాల వలన నేరాలు జరిగే అవకాశం ఉందన్నారు. గృహస్థులు ఆరుబయట నిద్రపోయే సమయంలో గృహాలలో దొంగతనాలు జరిగే వీలున్నదని వివరించారు. ప్రజలు బంగారం, నగదు, విలువైన వస్తువులు ఇంట్లో ఉంచుకోకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. ఊర్లకు వెళ్లేటప్పుడు ఇంట్లో లైట్లు ఆన్‌చేసి ఉంచాలని, ఇంటికి తాళం వేసి కనిపించకుండా కర్టన్స్‌తో కవర్ చేయాలని ఆయన తెలిపారు.

నేడు శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

యడ్లపాడు, మే 5 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడులోని శ్రీగంగా పార్వతీ సమేత రాజరాజేశ్వరస్వామి ఆలయం 8వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలపారు. సోమవారం వారు మాట్లాడుతూ వార్షికోత్సవానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సాయంత్రం 6 గంటలకు కండ్రిక, యడ్లపాడు, చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామాలకు చెందిన భజన సమాజాలకు చెందిన 60మందితో కోలాట ప్రదర్శన ఉంటుందన్నారు. 7 గంటలకు శివపార్వతుల శాంతి కల్యాణం, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

పరిష్కార వేదికకు 77 ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనను ఈ సోమవారం కూడా నిర్వహించారు. వివిధ అంశాలకు సంబంధించిన 77 ఫిర్యాదులను ఎస్పీ కంచి శ్రీనివాసరావు స్వీకరించారు. ఈ ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీస్ అధికారులకు సూచించారు. చిలకలూరిపేట పట్టణానికి చెందిన అన్వర్ భాషను జర్మనీ పంపిస్తానని నమ్మబలికి హరీష్‌సింగ్ మోసం చేసినట్లు ఫిర్యాదు చేశాడు. క్రోసూరు మండలం కారుమంచి గ్రామానికి చెందిన శిరీష ఈ ఏడాది జనవరి 23న బాలయేసుతో వివాహమైందని, ఇటీవల తన భర్త వివాహేతర సంబంధాలు పెట్టుకుని తనను హింసిస్తున్నాడని తగు న్యాయం చేయాలని ఫిర్యాదుచేశారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు ఫిర్యాదులు రాసి పెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహకారాలు అందజేశారు.

సీహెచ్‌వోలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నిరసన దీక్షలో కూర్చొని సంఘీభావం తెలియజేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లును ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నరసరావుపేట పట్టణం గాంధీ పార్కు వద్ద ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ అండ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 8వరోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరసన తెలియజేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరసన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సందర్శించి వైసీపీ తరఫున సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెంట వైసీపీ పల్నాడు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు అన్నెం పున్నారెడ్డి, మాజీ ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, పట్టణ వైసీపీ నాయకుడు షేక్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

● వార్డు కమిటీల ఎంపిక సమావేశంలో తెలుగు తమ్ముళ్లు

నాదెండ్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం, తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని గణపవరంలోని రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన తెలుగు తమ్ముళ్ళు తమ గళం విప్పారు. మూడో వార్డు టీడీపీ కమిటీ ఎంపిక కోసం నిర్వహించిన సమావేశంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకుల ఎదుట తమ సమస్యలను, ఆవేదనను వెల్లడించారు. రాజీవ్‌గాంధీ కాలనీ ఏర్పడి 30సంవత్సరాలు దాటినా అధికారులు మా సమస్యలను పట్టించు కోవటం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మా కాలనీ వైపు కనీసం కన్నెత్తి చూడటం లేదని వారు నాయకులకు వివరించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు దృష్టికి తీసుకు వెళ్ళి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని నాయకులు వివరించారు. కాగా 3వ వార్డు పార్టీ అధ్యక్షునిగా షైల రామాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా జీ దయారత్నం, కార్యదర్శిగా వై రమేష్ బాబును ఎన్నుకున్నట్టు మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు నెల్లూరి సదాశివరావు, సత్యనారాయణ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాలలో అగ్నిప్రమాదం

చిలకలూరిపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం మద్దిరాలలో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. సాయంత్రం 3గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తుల నిర్లక్ష్యం కారణంగా ఎండిపోయిన పిచ్చిచెట్లకు నిప్పంటుకుంది. మంటలు సమీపంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలోకి, పక్కనే ఉన్న 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లోకి వ్యాపించాయి. సమాచారం అందుకున్న చిలకలూరిపేట అగ్నిమాపక దళ సిబ్బంది శ్రమించి, సకాలంలో మంటలను ఆర్పివేయడంతో పెనుప్రమాదం తప్పింది. ఫైర్ ఆఫీసర్ ఎస్.కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌ఎఫ్ ఎస్.వెంకయ్య, సిబ్బంది ఆధ్వర్యంలో మంటలను అదుపుచేశరు.

యడ్లపాడులో...

యడ్లపాడు, మే 5 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడులోని మేదరవీధిలో సోమవారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సుమారు ఉదయం 10.30గంటల సమయంలో మహాలక్ష్మమ్మ చెట్టు సమీపంలోని కొండా సాంబయ్యకు చెందిన వరిగడ్డి వామి నుంచి అకస్మాత్తుగా దట్టమైన పొగలు రావడాన్ని చుట్టుపక్కల వారు గమనించారు. వెంటనే మోటార్ సాయంతో నీళ్ళు చల్లారు. జేసీబీని తెప్పించి మంటలు అంటుకున్న గడ్డివామి భాగాన్ని పక్కకు నెట్టించారు. స్థానికుల స్పందించి మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది.




సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం కే.అమలకుమారి

రైతు శాస్త్రవేత్తలకు శిక్షణ తరగతులు

నరసరావుపేట రూరల్ మే 5, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు అతిథి గృహంలో సోమవారం రైతు శాస్త్రవేత్తల నాలుగు సంవత్సరాల శిక్షణ కార్యక్రమంలో భాగంగా సెమిస్టర్ 2, 4 విద్యార్థులకు తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీపీఎం కె.అమలకుమారి రైతు శాస్త్రవేత్తల పొలాలను, వారు అమలుచేస్తున్న వివిధ నమూనాలను క్షుణ్ణంగా సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రైతులు ఎండాకాలంలో పొలాలను బీడుగా ఉంచకుండా ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని సూచించారు. వారి తోటలు, ఇతర పంట పొలాలలో ఎల్-ఆకారపు కట్టలు వేయడం యొక్క ప్రాముఖ్యతను మెంటర్‌లకు, రైతు శాస్త్రవేత్తలకు వివరించారు. కార్యక్రమంలో టీపీపీ కిరణ్‌మయి, డీపీపీ భవాని రాజు, శ్రీనివాస్, పలువురు మెంటర్‌లు, రైతు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ సీఐ ఆకస్మిక తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఈపూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): రొంపిచర్ల, ఈపూరు మండలాలలోని మద్యం దుకాణాల్లో సోమవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ సీఐ డీ వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మద్యం విక్రయాలు చేయాలని లేకపోతే చర్యలు తీసుకుంటామ బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించినా నేరమేనన్నారు. తనిఖీలలో ఎస్ఐ కే శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.